తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 214 అర్జీలు

తిరుపతి కలెక్టరేట్, జనవరి 6 ప్రభాతవార్తః



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని (పీజీఆర్ఎస్) కార్యాలయంలో వచ్చిన అర్జీలకు గడువు లోపు సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను వింటూ అర్జీలు స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, తదితర అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి ఆన్‌లైన్ నమోదుతో అర్జీదారులకు రసీదులను అందించారు.

## హెచ్ఎంపివి వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి

### సిఎం చంద్రబాబునాయుడు
### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి.. అధికారులతో టెలీ కాన్ఫరెన్స్..
### అనుమానిత కేసులు నమోదు కాలేదన్న అధికారులు !!

కుప్పం, జనవరి 6 ప్రభాతవార్త

దేశంలో హెచ్ఎంపివి వైరస్ కేసులు వెలుగు చూడడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సోమవారం దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సత్యకుమార్, వైద్యశాఖ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. హెచ్ఎంపివి వైరస్ పట్ల వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిఎం అధికారుల్ని ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా హెచ్ఎంపివి వైరస్ కేసులు నమోదు కాలేదని వైద్యాధికారులు సిఎంకు తెలిపారు. రాష్ట్రంలోకి కొత్తగా వచ్చి వెళ్లే వారిపై దృష్టి పెట్టాలని ఎక్కడ అనుమానం ఉన్నా పూర్తిస్థాయి వైద్య పరీక్షలు జరపాలని అధికారులకు నిర్దేశించారు.

# 'మాస్క్' ధరించాల్సిందేనా !

### వైరస్ బారినుండి రక్షణకు ముందు జాగ్రత్తలు తప్పదంటున్న వైద్యవర్గాలు



ప్రభాతవార్త-తిరుపతి:

హెచ్ఎంపివి వైరస్ కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో ప్రసిద్ద యాత్రాస్థలాలు, పుణ్యక్షేత్రం తిరుపతి, తిరుమలలో వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తం కానుంది. వాతావరణంలో మార్పులు రావడం, విపరీత చలినెలకొన్న తరుణంలో సీజనల్ వ్యాధులు తరచుగా చిన్నపిల్లలు, వృద్ధుల్లో అధికంగా వచ్చే అవకాశం ఉందని ఐఎంఎ వైద్యులు హెచ్చరించడం ఇప్పుడు ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరిగా చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఇప్పటి నుండే మాస్క్ ధరించాల్సి ందేనని, భౌతికదూరం పాటించాలని, తరచుగా సబ్బు, శానిటైజర్‌తో చేతులు కడుక్కోవాలని సూచిస్తున్నారు. జలుబు,దగ్గు విపరీతంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యవర్గాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే చైనాలో వ్యాప్తిచెందిన ఈ వైరస్ తాజాగా బెంగుళూరులో ఇద్దరు చిన్నారులకు, అహమ్మదాబాద్‌లో మరో చిన్నారికి హెచ్ఎంపివి వైరస్ పాటిజివ్ కేసు నమోదు కావడంతో వైద్యవర్గాలు ప్రజలను ముందస్తు అప్రమత్తం చేస్తున్నారు.ఇదే విషయంగా సోమవారం సాయంత్రం చిత్తూరుజిల్లా కుప్పం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా రాష్ట్రంలో వైద్యవర్గాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కొత్తవైరస్ పై ప్రభుత్వం అప్రమత్తమైందని వెల్లడించారు. అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడంతో వైద్యవర్గాలు అప్రమత్తమవుతున్నాయి. రాష్ట్రంలోకి కొత్తగా వచ్చి వెళ్ళి వాళ్ళపై దృష్టి పెట్టాలని, ఎక్కడ అనుమానం ఉన్నా పూర్తిస్థాయి పరీక్షలు జరపాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తిరుపతి,తిరుమలకు ప్రతిరోజూ 60వేలమంది యాత్రికులు దేశం నలుమూలల రాష్ట్రాల నుండి, విదేశాల నుండి వస్తున్నారు. మరీ వీరందరినీ పరీక్షించే పరిస్థితి వైద్యవర్గాలకు సాధ్యమా?అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు ప్రజలు ఎవరికివారే జాగ్రత్తలు తీసుకోవాలని, మాస్క్ ధరించడం తప్పనిసరి అని వైద్యులు ప్రధానంగా సూచిస్తున్నారు. గతంలో కోవిడ్ వైరస్ వ్యాప్తితో దేశంలోనూ, రాష్ట్రంలోనూ అనేక ఇబ్బందులు, ఆరోగ్యసమస్యలు ఎదుర్కొని జనజీవనం అతలాకుతలమైన చేదుఘటన చవిచూసిన విషయం అందరికీ విదితమే. ఇప్పుడు హెచ్ఎంపివి వైరస్ కలకలం రేపుతోంది. వీలైనంత వరకు చల్లని పానీయాలు, చల్లని ఆహారపదార్థాలు తినకూడదని వైద్యుల సూచనలు. ఈ హెచ్ఎంపివి వైరస్ వ్యాప్తిచెందితే శ్వాససంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, వీలైనంత వరకు ఈ వైరస్ నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ,దగ్గు, తుమ్ముల ఉండి వెలువడే తుప్పిర్లు ద్వారా కూడా వైరస్ వ్యాప్తిచెందుతుందని వైద్యులు చెబుతున్నారు. వీలైనంత వరకు దూరప్రయాణాలు కూడా వాయిదా వేసుకుంటే మంచిదని మరోమాట చెబుతున్నారు.

# ఇళ్లపైనే సోలార్ విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంలోనే ఓ చరిత్ర

### రాష్ట్రంలో 20లక్షల కుటుంబాలు.. ఎస్సీ,ఎస్టీలకు ఉచిత సోలార్ వెలుగులు !!
### - కుప్పంలో పిఎం సూర్యఘర్ పైలట్ ప్రాజెక్ట్ పథకానికి శ్రీకారం ..
### ముందున్నది మంచి రోజులే !! - సిఎం చంద్రబాబునాయుడు

కుప్పం/కుప్పంరూరల్, జనవరి 6 ప్రభాతవార్త

ప్రజల ఇళ్లపైనే విద్యుత్ ఉత్పత్తి చేయడం రాష్ట్రంలోనే ఓ చరిత్ర అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కుప్పం మండలం నడిమూరులో పిఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కుప్పంలో వందశాతం సోలరైజేషన్ పైలట్ ప్రాజెక్టును సిఎం చంద్రబాబునాయుడు లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలో నాగరాజు ఇంటిపై ఏర్పాటుచేసిన సోలార్ కనెక్షన్‌ను ప్రారంభించి వారి అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ప్రజలనుద్దేశించి సిఎం ప్రసంగించారు. రాష్ట్రంలోనే సోలార్ విద్యుద్దీకరణ ప్రజల ఇళ్లపై చేపట్టడం తొలిసారి అదికూడా కుప్పంలోనే మొదటిదన్నారు. రాష్ట్రంలో 20లక్షల కుటుంబాలకు, ఎస్సీ, ఎస్టీలకు సౌర విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా అందించడం జరుగుతుందని ప్రకటించారు. పేదలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సౌర విద్యుత్‌తో విద్యుత్ బిల్లుల చార్జీలు తగ్గుతాయన్నారు. మిగులు విద్యుత్‌ను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కుప్పంలో రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడ ంతో పాటు చార్జింగ్ స్టేషన్లు ప్రారంభిస్తామన్నారు. కుప్పంలో పర్యావరణ కాలుష్య నివారణకు కాన్పూర్ ఐఐటితో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. గాలి, ఆహారంతో కాలుష్యాలు జరుగుతున్నాయన్నారు. కుప్పంను మోడల్ నియోజకవర్గంగా చేసేందుకు గాను సోలార్ ప్రాజెక్టును చేపట్టామన్నారు. కుప్పంలో వర్షపునీటిని ఒడిసిపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గుడుపల్లె మండలంలో 1200అడుగుల లోతుల్లోకి భూగర్భజలాలు వెళ్లాయన్నారు. కుప్పంలో కార్బన్ ఫ్రీ, వాటర్ రిసోర్స్‌మెంట్, వాటర్ రీసైక్లింగ్, జీరో వేస్ట్‌మేనేజ్‌మెంట్ కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం కుప్పం ఏరియా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చుతామన్నారు. కుప్పంలో ప్రజల సమస్యల పరిష్కారంకై జననాయకుడు పోర్టల్‌ను ఏర్పాటు చేశామని ప్రజలు తమ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.






నడిమూరులో సోలార్ ప్రాజెక్టును ప్రారంభించి ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు
ప్రాజెక్టు గురించి సిఎంకు వివరిస్తున్న ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్

**కుప్పానికి రాబోయేవి మంచి రోజులే :**

కుప్పానికి రాబోయేవి మంచి రోజులేనని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పంనుంచి తనను ఎనిమిది సార్లు గెలిపించారని ఇది చరిత్ర అన్నారు. కుప్పం తనకు స్ఫూర్తి అని గతంలో జన్మభూమి, శ్రమదానం కార్యక్రమాలు ప్రారంభించానన్నారు. గత వైఎస్సార్సీ పాలనలో కుప్పంలో సైతం వైఎస్సార్సీ నేతలు అరాచకాలు, దాడులు, దోపిడీలు చేశారన్నారు. కుప్పంలో అభివృద్ధికి వారు అడ్డుపడితే తాట తీస్తానని హెచ్చరించారు. రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారం కోసం రీసర్వేను పకడ్బందీగా చేసి రైతులకు రాజముద్రతో పాస్ పుస్తకాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబుకు గ్రామంలో ప్రజలు, మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, కాన్పూర్ ఐఐటి డీన్ ప్రతీక్ సేన్, ప్రొఫెసర్లు రాజీవ్ జిందాల్, మనోజ్ తివారి, హరిశంకర్, కరుణ గౌతం, సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, టిటిడి బోర్డుసభ్యుడు వైద్యం శాంతారాం, రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, సర్పంచ్ మాదమ్మ పాల్గొన్నారు. అనంతరం సిఎం చంద్రబాబునాయుడు మున్సిపల్ పరిధి చీగలపల్లిలో ప్రకృతి వ్యవసాయ రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి మరలా ద్రవిడ వర్సిటీకి చేరుకుని పార్టీ నేతలతో సమావేశమయ్యారు.

## చిన్నపిల్లల్లో సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

### రుయా ఆస్పత్రి ఏఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ



సీజనల్ వ్యాధులు తరచుగా పిల్లల్లో జలుబు,దగ్గు వంటివి సహజంగానే వ్యాపిస్తాయని,, ముందుజాగ్రత్తగా వైద్యం పొందాలని రుయా ఆస్పత్రి ఏఆర్ఎంఒ డాక్టర్ హరికృష్ణ తెలిపారు. జలుబు,దగ్గు విపరీతంగా ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యం చేస్తే నివారణ అవుతుందన్నారు. ఇప్పుడు ఈ వైరస్‌పట్ల అపోహలు వద్దని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. రోధనిరోధక శక్తిని పెంపొందించే ఆహారం ఇవ్వాలని, రోడ్లపై విక్రయించే,పలు రకాల చిరుతిండ్లు, ప్యాకింగ్ స్నాక్స్ ,ఐస్‌క్రీమ్‌లు, శీతలపానీయాలకు దూరంగా ఉంచాలన్నారు.

# పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం!

### జనశ్రేణులకు చిన్నకష్టం వచ్చినా అండగా ఉంటా
### -"వార్త" కథనాలపై సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి




తిరుపతి/తిరుపతి రవాణ,ప్రభాతవార్త:

తిరుపతి నియోజకవర్గంలో జనసేనపార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా డివిజన్ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నియోజకవర్గంలో జనశ్రేణులకు ఏ చిన్న కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నగరంలోని 50 డివిజన్లలో పార్టీని పటిష్టం చేస్తామన్నారు. సంక్రాంతి తరువాత డివిజన్‌ల వారీగా పర్యటించి డివిజన్ కమిటీల నాయకులతో కలసి స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. తిరుపతిలో గత మూడురోజులుగా జనసేనపార్టీ నేతలు, సిట్టింగ్ ఎమ్మెల్యే పనితీరుపై జనం సమస్యలను కళ్లకు కట్టినట్లు వాస్తవ రూపంలో "వార్త"లో ప్రత్యేక కథనాలు వెలువడ్డాయి. దీంతో సోమవారం ఉదయం తిరుపతి నియోజకవర్గంకు చెందిన జనసేనపార్టీ నేతలు, శ్రేణులతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అత్యవసరంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక విషయాలు మాట్లాడారు. ఏడాదిలో కార్పొరేషన్ ఎన్నికలు రానున్నందున అప్పటికీ తిరుపతిలో పార్టీని బలోపేతం చేసుకుందామన్నారు. ప్రజాబలంతో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తామన్నారు. పోటీలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు, ఎవరిని పోటీకి నిలబెట్టాలనేది సిఎం, డిప్యూటీ సిఎం, బిజెపి నేత నిర్ణయిస్తారన్నారు.

జనసేన కార్యకర్తలు,నాయకులు ప్రజల్లోకి వెళ్ళి సమస్యలు తెలుసుకోవాలన్నారు. తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. ఈసమావేశంలో జనసేననాయకులు డాక్టర్ హరిప్రసాద్, పరిశీలకుడు వెంకటేశ్వర్లు, ఆరణి శివకుమార్, ఆరణి మదన్, ఆకేపాటి సుభాషిణి, కీర్తన, కిరణ్‌రాయల్, రాజారెడ్డి,కల్పనయాదవ్, నారాయణ, వనజ, జనసైనికులు పాల్గొన్నారు.

### పొగమంచు కమ్ముకోవడంతో

# భక్తులపైకి 108 అంబులెన్స్

### ఇద్దరు మహిళలు మృతి .. ముగ్గురికి గాయాలు





చంద్రగిరి, జనవరి 6 ప్రభాతవార్త:

పొగమంచు కమ్ముకోవడంతో కానరాని శ్రీవారి భక్తులపైకి 108 అంబులెన్స్ దూసుకెళ్ళిన దుర్ఘటన సోమవారం వేకువజామున నరశింగాపుం-ఏ.రంగంపేట మధ్యన చోటుచేసుకున్నది. వివరాల్లోకెళితే.. మదనపల్లికి చెందిన వ్యక్తి గుండెపోటుకు గురవడంతో 108 అంబలెన్స్‌లో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలిస్తున్నారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లా, రామసముద్రం మండలం, చంపాలపల్లికి చెందిన రెడ్డెమ్మ (40), లక్ష్మమ్మ 45), యశోద, తులశమ్మ, రమేష్ కాలినడకన తిరుమల శ్రీవారి దర్శనార్థం వస్తున్నారు. తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారి నరశింగారం-ఏ.రంగంపేట మధ్యన నడచి వస్తుండగా వెనుక నుండి వేగంగా వచ్చిన 108 అంబులెన్స్ పొగమంచులో ముందు వెళ్తున యాత్రికులను గుర్తించే లోపునే దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో రెడ్డెమ్మ, లక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ముగ్గురు గాయాలపాలయ్యారు. చంద్రగిరి సిఐ సుబ్బరామిరెడ్డి సంఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

## అపార్ట్మెంట్లు, వ్యాపార సముదాయాల నుంచి వేర్వేరుగా చెత్తను సేకరించండి

### కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, జనవరి 6, ప్రభాతవార్త



వ్యాపార సముదాయాలు, అపార్ట్మెంట్లు నుండి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే పార్కులను శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలో అభివృద్ధి పనులు, ఇంటింటి చెత్త సేకరణ, పన్నుల వసూళ్లు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వినతుల పరిష్కారంపై అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇంటింటి చెత్త సేకరణ లాగానే అన్ని హోటల్స్, వ్యాపార సముదాయాల వద్ద వేర్వేరుగా చెత్త సేకరణ చేయాలని అన్నారు. వేరు చేసిన చెత్తను అందరూ నగరపాలక సంస్థ సిబ్బందికి అందించేలా చూడాలని అన్నారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తున్న పార్కులను శుభ్రంగా ఉంచాలని అన్నారు. పార్కులు, స్కూల్స్ లో మరుగుదొడ్లు లేవని ఫిర్యాదులు వస్తున్నాయని, అంచనాలు సిద్ధం చేస్తే మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ హాసిమ్, డి.ఈలు, సూపరింటెండెంట్లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్వీయూ ఉద్యోగుల తీరే వేరు...

### ఎప్పుడు వస్తారో...ఎప్పుడు వెళ్తారో....!
### మెరుపు తీగను తలపించేలా విధుల నిర్వహణ
### ఉదయం 11 గంటల కావస్తున్నా విధులకు హాజరుకాని వైనం
### సిబ్బంది తీరుతో విద్యార్థులకు తప్పని తిప్పలు

తిరుపతి విద్య, జనవరి 6 ప్రభాతవార్త



ఎస్వీయూలో ఉద్యోగాల తీరే సపరేటు. ఎప్పుడు వస్తారో... ఎప్పుడు వెళ్తారో...తెలియని పరిస్థితి.వర్సిటీ ఏడీ బిల్డింగ్లో పలు విభాగాలలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల తీరుపై విద్యార్థులు మండి పడుతున్నారు.ప్రధానంగా సుదూర ప్రాంతాల నుంచి సర్టిఫికేట్ల కోసం, కాన్వికేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వర్సిటీకి వచ్చే విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. గంటల తరబడి ఉద్యోగుల కోసం విద్యార్థులు పలు విభాగాలలో చక్కర్లు కొడుతూ... సార్ ఎప్పుడు వాస్తారో... అంటూ ఎదరుచూ స్తుంటారు.ఈ తంతు వర్సిటీలో నిత్యకృత్యంగా దర్శనమిస్తోంది. మెరుపుతీగను తలపించేలా ఉద్యోగులు విధులు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

**-అధికారులు పలు మార్లు హెచ్చరించినా...**

వర్సిటీ వీసీ,రిజిస్ట్రార్ స్థాయి అధికారులు పరిపాలనా భవనంలోని పలు విభాగాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి హెచ్చరించినా కొందరి ఉద్యోగులలో మార్పు కనిపించకపోవడం ఆశ్చర్యకరం. కొన్ని విభాగాలలో బయోమెట్రిక్ విధానం లేకపోవడం ఉద్యోగులు తమకు ఇష్టం వచ్చిన సమయానికి విధులకు హాజరవుతుంటారని విద్యార్థులు వాపోతున్నారు.ప్రధానంగా ఎగ్జామినేషన్ సెక్షన్లో ఎక్కువగా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తుంటాయని, పట్టించుకునే నాథుడు కరువయ్యారంటూ బాధిత విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బయోమెట్రిక్ విధానం అమలు చేయాలి



ఎస్వీయూ ఏడీ బిల్డింగ్ లోని ఎగ్జామినేషన్ సెక్షన్ దారుణంగా తయారైంది. సోమవారం ఉదయం 11 గంటల అవుతున్నా ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడం దారుణం.వందల కిలోమీటర్ల నుంచి విద్యార్థులు సర్టిఫికేట్లకోసం వర్సిటీకి తల్లిదండ్రులతో కలసి వస్తుంటారు.కానీ ఉద్యోగులు సమయానికి హాజరుకాకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. అధికారులు వెంటనే బయోమెట్రిక్ విధానాన్ని కఠినంగా అమలు చేసి తీరాలి.విధులకు సమయానికి హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలి.సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు వెంటనే ధృవపత్రాలను అందజేసేలా అధికారులు చొరవచూపాలి.

-వి అశోక్ కుమార్,పరిశోధక విద్యార్థి,ఎకనామిక్స్ విభాగం, ఎస్వీయూ

# వీలైతే పట్టుకోండి పోలీసులు..

### వరుస చోరీలతో సవాలు విసురుతున్న నేరస్తులు
### అయోమయంలో పోలీసులు
### తిరుచానూరులో మరోమారు చోరీ యత్నం

తిరుచానూరు, జనవరి 6, ప్రభాతవార్త:

తిరుచానూరులో వరస దొంగతనాలతో దుండగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గత నెల రోజులలో ఐదు ప్రాంతాలలో దొంగతనాలు మరియు యత్నాలు జరుగుతున్నాయి. సమీప కాలంలో తిరుచానూరు స్టేషన్ పరిదిలోని పాడిపేటలో చోరీతో పాటు ఒక మహిళ హత్యగావించిన సంగతి విదితమే. ఇన్ని దొంగతనాలు జరుగుతున్నప్పటికి ఇప్పటి వరకు దుండగులు ఆచూకి లభించ లేదని తిరుచానూరు పోలీసులు అయోమయానికి గురి అయ్యారు. ఇది ఇలా వుండగా తిరుచానూరు పంచాయతీ దామినేడులో మరోమారు చోరీ యత్నం జరిగడంతో స్థానికులు ఆందోళనకు గురి అయ్యారు. పోలీసుల సమాచారం మేరకు చోరీకి గురి అయిన ఇంటి యజమాని వెంకటేశ్వర్లు వ్యాపారం చేసుకుని జీవనం సాగించేవారు. తనకు దామినేడులో అతిథి గృహం వున్నది. తన వ్యాపార నిమత్తం గత మూడు రోజులుగా హైదరాబాదుకు పయనమయ్యారు. మూడు రోజులుగా తాళం వేసివున్న ఇంటిని గమనించిన దుండగలు యదావిదిగా తలుపులు విరిచి దొంగతనానికి పాల్పడ్డారు. హైదరాబాదులో వున్న యజమాని వెంకటేశ్వర్లకు తిరుచానూరు పోలీసులు సమాచారం అందించి వెంటనే తిరుచానూరు పోలీస్టేషన్‌లో పిర్యాదు చేయవలసినదిగా సూచించినట్లు తెలిపారు.యజమాని పిర్యాదు మేరకు ఏవైనా చోరీకి గురి అయినాయా లేదా అనే సమాచారం తెలియవలసివుంది. ఈ సందర్భంగా తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక పోలీస్ టీమ్ ని ఏర్పాటు చేసామని అన్నారు. అన్ని ప్రాంతాలలో క్లూస్ టీమ్ ఆదారాలు సేకరిస్తున్నారని, త్వరలోనే వీటికి ముగింపు పలుకతామని తెలిపారు.



తలుపులు విరిచి దొంగతనానికి పాల్పడిన దుండగులు

# వైకాపా అభివృద్ధి పనులను కొనసాగించాలి



పుంగనూరు రూరల్, జనవరి 6, ప్రభాతవార్త

నియోజకవర్గంలో వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన పనులను పునరుద్ధరించి పూర్తి చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అనేక పరిశ్రమలు తెచ్చారని వాటిని కూటమి ప్రభుత్వం అడ్డుకున్నదని ఆరోపించారు. శ్రీకాళహస్తి పరిశ్రమ ఉత్పాదనలు ప్రారంభమయ్యాయి అని అన్నారు. వైకాపా పాలనలో చేసిన అభివృద్ధి పనులను ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాషా, వైఎస్ఆర్సిపి రాయలసీమ జిల్లాల కార్యదర్శి ఫక్రుద్దీన్ షరీఫ్, వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కృంగిన కల్వర్టు

పుంగనూరు రూరల్, జనవరి 6, ప్రభాతవార్త



పట్టణంలోని మునిసిపల్ బస్టాండ్ రోడ్డు నుంచి తాటిమాకుల పాళ్యంకు వెళ్లే మార్గం మొదట్లో కల్వర్టు కృంగి గొయ్యి ఏర్పడింది. దీంతో అటు వైపు వెళ్లే వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఏఎస్ఐ దూషణపై విచారణ

పుంగనూరు, జనవరి 6, ప్రభాతవార్త



మండలంలోని నల్లగుట్లపల్లి తాండ బాణావత్ మురళి నాయక్‌ను ఏఎస్ఐ మహేందర్ రావు గిరిజన కులం పేరుతో దూషించుటతో పాటు బండబూతులు తిట్టడం బాధితుడు తీసిన వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అవడంతో చిత్తూరు జిల్లా ఎస్సీ ఎస్టీ నిఘా మరియు పర్యవేక్షణ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్ పుంగనూరు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో బాధితుడు మురళి నాయక్ కలిశారు. ముఖ్యంగా మురళి నాయక్ మరియు ఏఎస్ఐ మహేందర్ మధ్య జరిగిన సంభాషణ వివరాలు విచారించారు. మురళి నాయక్ మాట్లాడుతూ నన్ను గిరిజన కులానికి చెందిన వ్యక్తిగా అనేక అనరాని మాటలు తిట్టినాడని తెలిపారు. అదేవిధంగా వారి కుమార్తె కూడా అక్కడ జరిగిన సంఘటన మొత్తం కమిటీ సభ్యుల ముందు తెలియజేయడం జరిగినది. వారి యొక్క ముఖ్య డిమాండ్ అతన్ని సస్పెండ్ చేయమని మరియు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని వారు డిమాండ్ చేయడం జరిగినది. ఈ వివరాలు అన్ని సేకరించి చిత్తూరు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, దృష్టికి తీసుకువెళ్లి బాధితుడికి న్యాయం జరగాలని గిరిజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావతి మునీంద్ర నాయక్, గిరిజన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కే. హరిశివప్ప, సంత్ సేవాలాల్ మహారాజ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎం.రెడ్డి నాయక్, సభ్యులు శంకర్ నాయక్, రవీంద్ర నాయక్, శివాజీ నాయక్, బాలాజీ నాయక్, శ్రీరాములు నాయక్, ఉమామహేశ్వర్ రావు, హరి మరియు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారుల అసోసియేషన్ మండల అధ్యక్షుడుగా "కె.సిద్దయ్య"



మండల కార్యదర్శిగా "యజ్ఞశ్రీ"

**చంద్రగిరి, జనవరి 6 ప్రభాతవార్త:** రెవెన్యూ అధికారుల అసోసియేషన్ మండల అధ్యక్షుడుగా విఆర్ఓ కె.సిద్దయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతి జిల్లా, తిరుపతి రెవెన్యూ డివిజన్, చంద్రగిరి మండల రెవెన్యూ అధికారుల అసోసియేషన్ ఎన్నికలు సోమవారం చంద్రగిరిలో నిర్వహించారు. అయితే ఈ ఎన్నికలలో అందరూ ఒక్కతాటిపై నిలిచి ఏకగ్రీవంగా ఈ మేరకు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా కె.సిద్దయ్య, కార్యదర్శిగా యజ్ఞశ్రీ, ఉపాధ్యక్షుడుగా పి.విష్ణువర్ధన్, జాయింట్ సెక్రటరీగా ఎన్.గిరి, కోశాధికారిగా బి.రెడ్డిప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు అశోక్‌కుమార్, కె.విజయ్‌కుమార్, పురుషోత్తం, నిశాంత్, ప్రియాంక, భాస్కర్, ధనంజయ వర్మ, శివ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి ప్రయోజనకరం

తహశీల్దార్ శివసుబ్బరామయ్య

చంద్రగిరి, జనవరి 6 ప్రభాతవార్త:



ప్రకృతి వ్యవసాయంలో పండించే పంటలు ఆరోగ్యానికి ప్రయోజనకరంగా వుంటాయని తహశీల్దార్ శివసుబ్బరామయ్య అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం రైతు సాధికార సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులతో పండించిన కాయగూరలు, పప్పుదినుసులు ఆహారంగా తీసుకోవడం వలన రోగాలు దరిచేరనియ్యవన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కాలుష్యం సైతం పెరుగుతున్న క్రమంలో మాంసాహారాలకు ప్రత్యామ్నాయం సేంద్రీయ ఎరువులతో పండించే కాయగూరలు ఎంతో మేలన్నారు.వేదవతి, అనూరాధ, హేమలత, తదితరులు పాల్గొన్నారు.



# పద్మానగర్‌కు ఎమ్మెల్యే చొరవతో మహర్దశ

రేణిగుంట జనవరి 6 ప్రభాతవార్త

రేణిగుంట మండలం జి పాలెం పంచాయితీ పద్మానగర్ నందు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాలతో అధికారులు స్పందించి 13.5 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడంతో సిసి రోడ్లకు శ్రీకారం చుట్టినట్లు టిడిపి సీనియర్ నేత రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సిసి రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్డు పనులను వారం రోజుల్లో పూర్తి చేస్తామని రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గత దశాబ్దాల కాలంగా ఏర్పడిన కాలనీలో స్మశానం, అంగన్వాడి కేంద్రం లేకపోవడం గుర్తించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో స్మశానానికి భూమి కేటాయించడానికి తాహసిల్దార్ సురేష్ బాబు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిపారు.

# ఎస్టీల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో కృషి : హనుమంతు

చౌడేపల్లి, జనవరి 6 ప్రభాతవార్త



మండలంలోని ఎస్టీల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకొంటున్నట్లు తహశీల్దార్ హనుమంతు అన్నారు. ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో ఆమినిగుంట, దిగువపల్లి, దుర్గసముద్రం, ఆమినిగుంట, గడ్డంవారిపల్లి తదితర పంచాయతీ గ్రామాల్లో ఎస్టీలు అధికంగా వున్నారన్నారు. వారికి ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ముందుగా ఆధార్‌కార్డులు కావాలన్నారు. ఇప్పటికే 90శాతానికి పైగా ఆధార్‌కార్డులు పంపిణీ చేశామన్నారు. నివేశస్థలాలు, పక్కాఇళ్ళ నిర్మాణాలకు ప్రణాళికా బద్దంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. డిటి మాధవి, ఆర్ఐ భారతిలు హాజరయ్యారు.

# మహిళల జీవన ప్రమణాన్ని పెంచేందుకు చర్యలు : సుబ్రమణ్యం

చౌడేపల్లి, జనవరి 6 ప్రభాతవార్త



స్వయం సహాయక మహిళల జీవన ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకొంటున్నామని ఐకెపి ఎపిఎం సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక కార్యాల యంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంఘాలకు 35శాతం రాయితీతో అందించే పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ రుణాలు తక్కువ వడ్డీతో అందించే ముద్ర రుణాలు, డైరీ రుణాలు, ఎంఎస్ఎంఇ రుణాలందిస్తామన్నారు. అంతే కాకుండా సంఘాల్లో జీవనోపాధులు పెరిగేలా పలు పథకాలు రూపొందిస్తున్నట్లు వివరించారు. ఖాన్‌సాబ్‌మిట్టలో బిస్కెట్ల తయారీ, పేపర్‌ప్లేట్లు, నూనె ఉత్పత్తులను ప్రోత్సహించేందుకై ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ తరహాలో ఇంటివద్దకే వస్తువులందించే చేపడుతున్నట్లు వివరించారు. సిసిలు రమేష్, నాగరత్నలు హాజరయ్యారు.

# 10న కాణిపాకంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

కాణిపాకం, జనవరి 6 ప్రభాతవార్త:

వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలను ఈనెల 10 కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. కాణిపాకం దేవస్థానం ప్రధాన ఆలయంకు అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి పెరియదేవి సయిత శ్రీవరదరాజస్వామి ఆలయంలలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు,పుష్పాలంకరణ చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా స్వామివారికి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను అందజేయ న్నుట్లు తెలిపారు. అలాగే ఉదయం 10 గంటలకు స్వామివారికి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఈవేడుకల్లో ఆలయ ఉభయదారులు, గ్రామస్థులు,భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

కార్వేటినగరం,జనవరి 6 ప్రభాతవార్త:



పిఆర్‌టియు 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఇఓలు యం.విజయ్‌కుమార్,డి.పి. మనోజ్‌క 'సమార్'లు స్థానిక ఎంఆర్‌సి కేంద్రం నందు ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఎంఇఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన,ఉత్తమబోధన ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్దికి కృషి చేయాలన్నారు. పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి జోగి గురుమూర్తి మాట్లాడుతూ పిఆర్‌టియు సంఘం ఉపాధ్యాయుల హక్కులు,బాధ్యతలు రెండు కళ్ళులా ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మునిలక్ష్మి,ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం,జిల్లా నాయకులు దామోదరం,కళ్యాణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

# పిల్లలు మన సాంప్రదాయాలను గౌరవించాలి

పెద్దపంజాణి,జనవరి 6,ప్రభాతవార్త:



పిల్లలకు చిన్న తనం నుండే మన సాంప్రదాయాలపై తల్లి దండ్రులు అవగాహన కల్పించి సాంప్రదాయాలపై గౌరవించేలా చూడాలని మండలంలోని తులసమ్మ గుడి మండల పరిషత్ ప్రథమికోన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ మాధవి తెలిపారు.స్థానిక పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా పిల్లల సాంప్రదాయ వస్త్రదారణతో అలరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు పండుగలు వాటి విశిష్టతలను తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్ అహ్మద్,సురేంద్ర,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తడుకు పేటలో దళితులపై దాడి దారుణం

పెద్దపంజాణి,జనవరి 4,ప్రభాతవార్త:

నగిరి నియోజకవర్గం తడుకుపేటలో దళితులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచి గాయపడిన వారినే పోలీసులు రిమాండ్ చేయడం దారుణమని జాతీయ మానవ హక్కులు అవినీతి నిర్మూలన సంస్థ,మాల మహానాడు,జై భీమ్ సంఘం,బిల్డింగ్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు.మండలంలో సోమవారం జరిగిన సమావేశంలో డి.వి.మునిరత్నం మాట్లాడుతూ తడుకుపేటలో దళితులపై అగ్రవర్ణాల వ్యక్తులు తీవ్రంగా గాయపరచడమే కాకుండా వారిపై కేసులు పెట్టి రిమాండుకు పంపడం దారుణమని తెలిపారు.వాస్తవాలను గుర్తించి దళితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్ధసారథి,తిప్పన్న,సాంబశివ,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# వామ్మో చలి " పులి "...!

చౌడేపల్లి, జనవరి 6 ప్రభాతవార్త



మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. తెల్లవారు జామున 3గంటల నుంచి పొగమంచు దట్టంగా కమ్ముకొని ప్రజలను గజగజ వణికిస్తోంది. ఉదయం 10గంటలైనప్పటికీ పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు సైతం కనిపించకుండా చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఇళ్ళకే పరిమితమవుతున్నారు. కూలీ పనులు చేసుకొని జీవించే వారి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. తీవ్ర చలి ఎప్పటికి తగ్గుముఖం పెడుతుందోనని అందరూ అనుకొంటున్నారు.

# విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పుంగనూరు, జనవరి 6, ప్రభావతవార్త



విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గురు రాజారావు మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అలాగే చెల్లించాల్సిన బకాయిలను మంజూరు చేయాలని జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

# మలేషియాలో తెలుగురైతుకు దక్కిన అరుదైన గౌరవం



-చౌడేపల్లి వాసులకు అవార్డుల పంట

-శ్రీరామ్ గోపాల్‌ను సత్కరించిన వైనం

చౌడేపల్లి, జనవరి 6 ప్రభాతవార్త

ఖండాంతరాల్లో తెలుగు వారికి ఖ్యాతిని చాటిన చౌడేపల్లి వాసులకు అరుదైన గౌరవం దక్కింది. వారి వారి రంగాల్లో సమాజహితం కోరుతున్న ముగ్గురు వ్యక్తులను మలేషియా దేశంలో సత్కరించారు. మలేషియా దేశంలో కౌలాలంపూర్ నందు జరిగిన సంక్రాంతి సంబరాల్లో తెలుగు తేజాలను ఘనంగా సత్కరించారు. చౌడేపల్లికి చెందిన శ్రీరామ్ గోపాల్‌ను ఉత్తమ రైతుగా బిరుదాంకితం చేసి మెమొంటోతో సత్కరించారు. బయోలిక్కర్స్ సృష్టికర్త డాక్టర్ బిఎస్.అమరనాథ్, చౌడేపల్లిలో కోట్లాది రూపాయల స్థలాలను ప్రభుత్వ కార్యాలయాలకందించిన దాత, నామమాత్రపు ఫీజులతో వైద్యం చేస్తూ అందరి అభిమానాలను చూరగొన్న డాక్టర్ మురళీధర్‌లను ఘనంగా సత్కరించారు. యేటా మలేషియా తెలుగు సంఘం అందిస్తున్న ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మలేషియా ఇండియన్ హైకమీషన్ ఛాన్సలర్ అమృతదాస్, ఆంధ్ర అసోషియేషన్ అధ్యక్షుడు బొలిశెట్టి శ్రీరామ్, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ జగదీష్ రాయల్, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ సంఘాలు బ్లాక్‌మెయిల్ రాజకీయం

- తెలుగుదేశం నాయకులు ధ్వజం

చిత్తూరు, జనవరి 6 ప్రభాతవార్త:



ఎపి గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామిరెడ్డి ప్రభుత్వంను బ్లాక్‌మెయిల్ చేసేలా రాజకీయ నాయకుడి తరహాలో మాట్లాడుతున్నారని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మేషక్, రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్‌లు ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ వెంకటరామిరెడ్డి వెనుక కొన్ని అదృశ్య శక్తులు వున్నాయని, అలాగే మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యోగ సంఘ నాయకుడిగా వున్న వెంకటరామిరెడ్డి ఒక్కరోజు సైతం విధులకు హాజరు కావడం లేదని పత్రికల్లో రాజకీయ నాయకుడి తరహాలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కాలం వెల్లబుచ్చుతూ, ప్రజాధనంను జీతంగా పుచ్చుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఉదయాన్నే లబ్దిదారుల ఇళ్ళకు వెళ్ళి పెన్షన్ ఇవ్వాల్సిందిగా చెప్తుందని, మహిళా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంకటరామిరెడ్డి తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ సిఎంగా వున్న సమయంలో ఉపాధ్యాయులు మద్యం షాపుల వద్దకు వెళ్ళి విధులు నిర్వర్తించాల్సి వచ్చిన సమయంలో ఈ ఉద్యోగ సంఘ నేత ఎక్కడికి వెళ్ళారని వారు నిలదీశారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు మధుయాదవ్, వాసు నాయుడు, సురేష్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుళ్ళ ఎంపిక శారీరక దారుఢ్య పరీక్షలు వాయిదా

- ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, జనవరి 6 ప్రభాతవార్త:

చిత్తూరు పోలీసు ట్రైనింగ్ మైదానంలో బుధ, గురువారాల్లో నిర్వహించాల్సిన పోలీసు కానిస్టేబుల్ ఎంపిక శారీరక దారుఢ్య పరీక్షలను వాయిదా వేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వాయిదా పడిన పరీక్షలను ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. అభ్యర్థులకు పాత తేదీల్లో పరీక్షల కోసం ఇచ్చిన అడ్మిట్ కార్డులు మార్చిన తేదీల్లో జరిగే పరీక్షలకు చెల్లుబాటు అవుతాయన్నారు. అభ్యర్థులకు మరింత సమాచారం కోసం ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి అధికారిక వెబ్‌సైట్ లేదా హెల్ప్‌లైన్ నెంబర్ 94414 50639ను సంప్రదించాలని ఆయన కోరారు.

# జడ్పీలో ఏడు మందికి కారుణ్య నియామకాలు

చిత్తూరు, జనవరి 6 ప్రభాతవార్త:



జిల్లా పరిషత్‌లో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఏడు మంది అభ్యర్థులకు సోమవారం కారుణ్య నియామకాలకు సంబంధించిన నియామక పత్రాలను అందజేశారు. జిల్లా పరిషత్‌లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న జూనియర్ అసిస్టెంట్ల కారుణ్య నియామకాలను వున్న ఖాళీల మేరకు అర్హులైన వారితో నియామకాలు చేపట్టారు. ఈ మేరకు సోమల మండలం నంజంపేట జడ్పీ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్‌గా కె.పావని, ఎస్ఆర్ పురం జడ్పీ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌గా వి.ఆరుణ, బైరెడ్డిపల్లి జడ్పీ బాయ్స్ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్‌గా పిపి మనీషా, విజయపురం జంబాడ జడ్పీ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌గా ఎం.హిమవర్ష, జిల్లా పరిషత్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌గా బి.లోకేశ్వరీ, ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌గా సి.భానుప్రకాష్, వి.కోట మండలం ముదరందొడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌గా ఎ.సాగర్‌లను నియమిస్తూ జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు వారికి నియామక పత్రాలు అందజేశారు.

# 'వార్త-2025' క్యాలెండర్ ఆవిష్కరణ

గుడిపాల, జనవరి 6 ప్రభాతవార్త:



'వార్త-2025' నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు సోమవారం ఆవిష్కరించారు. మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది 'వార్త' యాజమాన్యం వినూత్న రీతిలో కొత్త హంగులతో క్యాలెండర్లను ఆవిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నదన్నారు. తెలుగుదేశం నాయకులు రవినాయుడు, చిట్టి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

# సిఆర్‌రెడ్డి కళాశాల విద్యార్థుల ప్రతిభ

తొట్టంబేడు,జనవరి 6 ప్రభాతవార్త



డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో మండలంలోని డాక్టర్ సి.ఆర్.రెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు సాధించిన ఫలితాల్లో బి.ఏ పొలికల్ సైన్స్‌లో టి.పవన్‌కళ్యాణ్‌రెడ్డి 6.74, కె.జ్యోతిక 6.54, బి.కాంలో వి.కీర్తన 8.39, ఎ.సూర్య దిక్షతి 6.83 మరియు బిఎస్సీ బాటనీలో డి.చెంచులక్ష్మి 6.65 గ్రేడ్ పాయింట్స్ సాధించారు. ఈసందర్భంగా ఉత్తమ ఫలితాల్లో సాధించిన విద్యార్థినీ విద్యార్థులను అధ్యాపక బృందం, కళాశాల ప్రిన్సిపల్ కె.యశోద, కరస్పాండెంట్ డా.సి.రాజగోపాల్‌రెడ్డిలు అభినందించారు. తమ కళాశాలలో ఉత్తమ బోధనతో పాటు విలువతో కూడిన బోధన అందిస్తున్నామన్నారు.

# ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాంకుల ప్రభంజనం

.తొట్టంబేడు, జనవరి 6 ప్రభాతవార్త




ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన రెండో సెమిస్టర్ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టణ మరియు యూనివర్సిటీ స్థాయిలో అన్ని గ్రూపుల్లో అగ్రస్థానాలకు కైవసం చేసుకున్నారని కరస్పాండెంట్ సి.మధుసూధన్‌రెడ్డి తెలిపారు. బి.ఎస్సీ(భౌతికశాస్త్రం) గ్రూపులో కె.హర్షిత 8.92, పి.ఉపేంద్ర 8.55, కె.తేన్మోలి 8.28, ఆర్.రవితేజ 8.28, ఎస్.చైతన్య 8.28, బి.ఎస్సీ(సాంఖ్యకశాస్త్రం) గ్రూపులో బి.సుచిత 9.21, పి.హారిక 8.94, టి.తేజస్విని 8.11, బి.ఎస్సీ(బయోటెక్నాలజీ) గ్రూపులో కె.పావనీ 9.01, కె.లిఖిత 8.82, పి.హసీఫా 8.59 పాయింట్లతో యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బి.కాం(సి.ఏ) గ్రూపులో జె.సింధూప్రియ 8.68, పి.చాముండేశ్వరి 8.68, ఇ.రాజేశ్వరి 8.43, పి.చరణ్ 8.08, పి.గిరీష్‌కుమార్ 8.08, ఎస్‌కె.మసీరా తాజ్ 8.08 పాయింట్లతో పట్టణ, యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీ, తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సి.మధుసూధనరెడ్డి మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# రెవెన్యూ సదస్సుల్లో 367 వినతులు

-ఇప్పటికే 10 సర్వే సమస్యలు పరిష్కారం..

తొట్టంబేడు, జనవరి 6 ప్రభాతవార్త



మండలంలో ఉన్న అన్నదాతల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని తహశీల్దార్ యు.మధుసూధనరావు తెలిపారు. మండలంలోని 27 పంచాయతీల్లో 41 రెవెన్యూ గ్రామాల్లో గత నెల 6 నుంచి ఈనెల 4వతేదీ వరకు ప్రతిరోజు రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈనేపథ్యంలో ముఖ్యంగా గుండెలిగుంట పంచాయతీ విరూపాక్షపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్,ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, బోనుపల్లి గ్రామంలో ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి,పెద్దకనపర్తి గ్రామంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్‌లు హాజరయ్యారు. వీరితోపాటు స్థానిక సర్పంచ్, ఎంపిటిసిలు హాజరయ్యారు. పలు గ్రామాల్లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే 70శాతం వస్తున్నాయని జిల్లా కలెక్టర్ విరూపాక్షపురం సదస్సులో పేర్కొన్న విషయం విదితమే. ఈనేపథ్యంలో వీటిని పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈసదస్సుల్లో మొత్తం 367 సమస్యలు వివిధ సమస్యలపై వినతులు వచ్చాయని తహశీల్దార్ మధుసూధనరావు తెలిపారు. ప్రతి సదస్సుల్లో తహశీల్దార్‌తో పాటు డిఐ రాఘవయ్య, మండల సర్వేయర్ హరనాథ్, రెవెన్యూ గ్రామాల విఆర్ఓలు, సీనియర్ అసిస్టెంట్ నారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్‌లు హాజరయ్యారు. మండలంలోని 41 రెవెన్యూ గ్రామాలైన పెన్నలపాడు, కొన్నలి, పూడి, ఇలగనూరు, కొణతనేరి, బోనుపల్లి, దైనేడు, పిల్లమేడు, మామిడిగుంట, కాసరం, గొట్టిపూడి, రాంబట్లపల్లి, చియ్యవరం, చేమూరు, కొండచేనుకండ్రిగ, చోడవరం, సిద్దిగుంట, పెద్దగుంట, విరూపాక్షపురం, గుండెలిగుంట, సాంబయ్యపాళెం, బసవయ్యపాళెం, పెద్దకన్నలి,చిన్నసింగమాల, గురుకులపాళెం, పొయ్య, గుమ్మిడిగుంట, రౌతుసూరమాల, తాటిపర్తి, కల్లిపూడి, తంగేళ్ళపాళెం, గౌడమాల, దొంగలముడూరు, శ్రీకృష్ణాపురం, శివనాథపాళెం, పెద్దకనపర్తి కంచనపల్లి, చిట్టత్తూరు తొట్టంబేడు, సిఆర్ఎన్‌కండ్రిగ, ఈదులగుంట రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 367వివిధ శాఖలకు సంబందించిన వినతులను అందించారు. ఇందులో ముఖ్యంగా సర్వేకు సంబందించి52 వినతులు వచ్చాయని మండల సర్వేయర్ హరనాథ్ తెలిపారు. కాగా ఇందులో ఇప్పటికే 10 సమస్యలను పరిష్కరించామని మిగిలిన వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. భూసమస్యలను పరిష్కరించడంలో అందరి సహకారం అవసరం అని రికార్డుల పరంగా ఉన్నట్లు పరిష్కరిస్తామని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే గ్రీవెన్స్‌డేలో వినతులు ఇస్తే పరిష్కరిస్తామని తహశీల్దార్ మధుసూధనరావు తెలిపారు.

# సిఆర్ఎన్‌కండ్రిగలో భూవివాదాన్ని పరిశీలించిన అధికారులు

తొట్టంబేడు, జనవరి 6 ప్రభాతవార్త

మండలపరిధిలోని సిఆర్ఎన్‌కండ్రిగ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్50/10లో మొత్తం 3.72సెంట్లు పట్టాభూమి ఉంది. అయితే దీన్ని చెంగల్రాయులు నుంచి డి.మునిరెడ్డి, ఆయయ నుంచి రఘునాథరెడ్డి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకుని ప్లాట్లు వేసి విక్రయించారు. అయితే 3.22ఎకరాలు ఉండగా 3.72 సెంట్లు రిజిస్ట్రేషన్ చేయడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. అయితే ఈభూముల్లో రెండు ఎకరాల భూములు మునిరెడ్డి కుమారుడు, మనుమరాలికి గిఫ్ట్‌గా రాసిచ్చాడు.దీంతోవారు తమభూములు తమకు అప్పగించాలని కోరారు.1996లో కెవిఎస్‌నాయుడుకు 1 ఎకరా, తమ్ముడికి 0.50సెంట్లు, సతీష్‌నాయుడు 1.22సెంట్లు విక్రయించారు. వీరు దీనిలో ప్లాట్లు వేసి విక్రయించగా గిఫ్ట్‌గా ఇచ్చాడన్న డాక్యుమెంట్లతో తమ భూములను చూపాలని మునిరెడ్డి కుమారుడు మనుమరాలు సిఎంకు వినతిపత్రం పంపింది. దీంతో సోమవారం సర్వే ఉన్నతాధికారి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాంప్రసాద్ మండల సర్వేయర్ హరనాథ్, సచివాలయ సర్వేయర్ రాఘవ తదితరులతో కలసి పరిశీలించారు. భూములు కొనుగోలు చేసిన వారు ప్లాట్లు వేసి విక్రయించారు. దీంతో కొనుగోలు చేసిన వారితో పాటు విక్రయించిన వారు ఇబ్బందులుకుగురవుతున్నారు.దీనిపైఇన్‌స్పెక్టర్‌ఆఫ్‌సర్వే రాంప్రసాద్ ఏంచర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

# 19వసారి సైకిల్‌పై శబరిమలైకు



పట్టణానికి చెందిన శ్రీనివాసులు(66) ప్రతి ఏడాది సైకిల్‌పై శ్రీకాళహస్తి నుంచి శబరిమలై యాత్రకు బయలుదేరుతాడు. ఈనేపథ్యంలో ఈఏడాది కూడా సైకిల్‌పై శబరిమలైయాత్రకు బయలుదేరాడు. స్వామియే శరణం..అయ్యప్ప అంటూ ఎముకలు కొరికే చలిలో ఆయన సైకిల్‌యాత్ర సాగుతుంది. సరిగ్గా సంక్రాంతి పర్వదినంరోజున శబరిమలై చేరుకుని స్వామివారిని దర్శించుకున్న అనంతరం రాత్రి మకర సంక్రాంతిరోజున ఆకాశంలో స్వామివారిని దర్శించుకుని తిరుగుపయనమవుతారు.

# ప్రకృతి వ్యవసాయ పంటలే ఆరోగ్యానికి శ్రేయస్కరం

తొట్టంబేడు, జనవరి 6 ప్రభాతవార్త

ప్రకృతి వ్యవసాయ పంటలే ఆరోగ్యానికి శ్రేయస్కరం అని పెద్దకనపర్తి గ్రామానికి చెందిన రైతు సుధాకర్‌తో పాటు మహిళా రైతులు వీనా భార్గవి, రమాదేవి, చరణ్‌లు ప్రకృతి వ్యవసాయంతో తమ పంటపొలాల్లో ఆకుకూరలు, కూరగాయాలు పండించి ప్రతి సోమ వారం మండలపరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా రూపొందించిన స్టాల్‌ను ఏర్పాటుచేసి ఇక్కడకు విచ్చేసిన వారికి విక్రయిస్తుంటారు. ఇందులో ముఖ్యంగా ఆకుకూరలుతో పాటు బెండ, కాకర కాయలు, బీరకాయలు, వంకాయలు ఇతర ఆకుకూరలు పండిస్తున్నారు. వ్యవసాయ సాగులో ముఖ్యంగా ఎలాంటి మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయంతో చేసిన కూరగాయాలుప్రజల ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని ప్రజలు కూడా ఇలాంటి వాటిని కొనుగోలు చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతి సోమవారం తొట్టంబేడు మండలపషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 9 గం.నుంచి మద్యాహ్నం వరకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని సుధాకర్ తెలిపారు.

# తిరుపతి డివిజన్

## పేరడం ప్రభుత్వ పాఠశాలలో పేరు, ఊరు లేని నామఫలకం

సత్యవేడు, జనవరి 6 ప్రభాతవార్త:



సత్యవేడు మండలం పేరడం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ఏర్పాటు చేసిన నామఫలకం పేరు లేకుండా దర్శనమిస్తోంది. పాఠశాల వైపు ఎవరు చూసినా అది ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల అన్నది నామ ఫలకాన్ని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇక్కడ పాఠశాల ప్రవేశంమెయిన్ గేటు వద్ద నామఫలకంలో పాఠశాల పేరు, ఊరు రాయించడానికి సంబంధిత ప్రధానోపాధ్యాయురాలు మర్చిపోయారు. గతంలో జరిగిన నాడు-నేడు పథకంలో మంజూరైన నిదులను వెచ్చించి ఈ నామఫలకాన్ని నిర్మించారు. అయితే నామఫలకంపై పాఠశాల పేరును రాయించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో సంబంధిత హెచ్ఎం నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారులు స్పందించి మెయిన్‌గేటు నామఫలకంపై పాఠశాల పేరు ఊరు రాయించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఈ.ఎస్.ఐ ఆసుపత్రి భాగా అభివృద్ధి చెందుతుంది .

తిరుపతి హెల్త్ జనవరి 6 ప్రభాత వార్త:



తిరుపతి ఈ.ఎస్.ఐ హాస్పిటల్ 50 పడకల నుండి 100 పడకలు చేసిన సందర్భంగా బాలాజీ నర్సింగ్ కాలేజ్ అధినేత డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామ్ బాబు ని పుష్ప గుచ్ఛంతో అభినందించారు.అలాగే నూతన సంవత్సర శుభాకాంక్షలు తో పాటు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రవీణ్ మాట్లాడుతూ డాక్టర్ శ్యాం బాబు నిబద్ధత కలిగిన కార్యదీక్ష కలిగిన వైద్యుడు, అడ్మినిస్ట్రేటర్ అని వీరి ఆధ్వర్యంలో ఈ.ఎస్.ఐ ఆసుపత్రి ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.డాక్టర్ శ్యాం బాబు మాట్లాడుతూ దాదాపు 6 లక్షల కార్మికులు కలిగిన ఈఎస్ఐ పరిధిలో వంద పడకల ఆసుపత్రి గా తీర్చిదిద్దడం కార్మికులకి ఎంతో అవసరమని 24 గంటలు ఇక్కడ వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం 191 పోస్టులు త్వరలోనే భర్తీ చేయనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జెస్సి గ్రేస్, విజయ కుమారి,బి విజయన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కార్యక్రమం

తిరుపతి విద్య నవంబర్ 6 ప్రభాత వార్త:




శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా లైంగిక వేధింపుల చట్టం గురించి అవగాహన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది అపర్ణాదేవి మాట్లాడుతూ మహిళల లైంగిక వేధింపుల చట్టం ఆవశ్యకతను విపులంగా వివరించారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ జి భద్రమణి మాట్లాడుతూ పోష్ చట్టం గురించి అవగాహన కలిగి విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి దేవి, ఉమారాణి, కమిటీ సభ్యులు సి హెచ్ సుహాసిని, కె విజయ కుమారి, డి లక్ష్మీదేవి, జి నాగమణి, జి శ్రీ వాణి అధ్యాపకులు డాక్టర్‌విద్యులత, డాక్టర్‌కె.పిపద్మజ, డాక్టర్ వసుధ, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ జ్యోతి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## వైఖానస శైవాగమాలపై జాతీయ వర్క్ షాప్

తిరుపతి విద్య జనవరి 6 ప్రభాత వార్త:

జాతీయ సంస్కృత వర్సిటీలో వైఖానస పాంచరాత్ర శైవాగమాలలో అర్చకత్వ శిక్షణ అనే అంశంపై ఈనెల 28 నుంచి రెండు రోజులపాటు జాతీయ వర్క్ షాపు నిర్వహించనున్నట్లు ఆగమ విభాగాధిపతి ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఆగమ పండితులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారని తెలియజేశారు.

## ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, జనవరి 6, ప్రభాతవార్త



ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ ఎన్. మౌర్య పేర్కొన్నారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుండి 39 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. టౌన్ క్లబ్ పక్కన రోడ్డు వెడల్పు కోసం తీసుకున్న స్థలానికి టి.డి.ఆర్. బాండ్ ఇవ్వాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. కాగా తాము కొర్లగుంట మారుతినగర్ నందు నివసిస్తున్నానని, రికార్డుల్లో ముత్యలరెడ్డి పల్లి న్యూ మారుతి నగర్ గా నమోదు అయినదని మార్పు చేయాలని కోరారు. టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, రాజీవ్ గృహకల్ప కింద ఇంటికోసం డబ్బులు కట్టామని ఇల్లు రాలేదు మా నగదు మాకు ఇవ్వాలని కోరారు. తాను మాజీ సైనికుడిని నాకు గృహ నిర్మాణ పథకంలో ఇల్లు ఇప్పించాలని, శివజ్యోతి నగర్ నందు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వలన చుట్టూ పక్కల బోర్లలో నీరు రావడం లేదని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ హైస్కూల్ ను జూనియర్ కాలేజీగా అప్గ్రేడ్ చేయాలని, శెట్టిపల్లి పట్టాదారులకు రెండ్లు సెంట్లు స్థలం ఇవ్వాలని, పోస్టల్ కాలనిలో చెట్లు తొలగించాలని, సి.సి రోడ్లు వేయాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, మేనేజర్ హాసిమ్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, డి.ఈ.లు, సూపరింటెండెంట్లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు దయాకర్ ఘన సన్మానం

తిరుపతి కలెక్టరేట్, జనవరి 6 ప్రభాతవార్త ః



తిరుపతి జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారిగా పి. దయాకర్ సోమవారం పూర్తి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను పి. దయాకర్ సోమవారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువ, పుష్పగుచ్ఛాలతోఘనంగాసత్కరించి అభినందించారు.

## ఇంటర్ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలి

- ప్రిన్సిపాల్స్‌కు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి విశ్వనాయక్ సూచన

తిరుపతి కలెక్టరేట్, జనవరి 6 ప్రభాతవార్త ః




ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థినీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ప్రిన్సిపాల్స్ చర్యలు చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (ఆర్ఐవో) విశ్వనాథనాయక్ అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జిల్లాలోని 21 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్ ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో త్రైమాసిక, అర్ధ వార్షిక పరీక్షలలో విద్యార్థిని విద్యార్థులు సాధించిన మార్కులపై సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ సబ్జెక్టుల నందు 50 శాతం కన్నా తక్కువ మార్కులు వచ్చిన పిల్లలను గుర్తించి వారు ఏ సబ్జెక్టు నందు బలహీనంగా ఉన్నారో వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి కళాశాలలో ఐపీఈ 2025 నందు వంద శాతం ఉత్తీర్ణులు అయ్యేలా తప్పకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ క్యారెక్టర్‌కు భంగం కలిగిస్తే ఖబడ్దార్

సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం హేయం

టిడిపి సీనియర్ నాయకుడు మొక్కల కుమార్‌రాజారెడ్డి

చంద్రగిరి, జనవరి 6 ప్రభాతవార్త:



ఎంఎల్ఏ పులివర్తి నాని కారెక్టర్‌కు భంగం కలిగిస్తే ఖబడ్దార్ అంటూ టిడిపి సీనియర్ నాయకుడు మొక్కల కుమార్‌రాజారెడ్డి హెచ్చరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాను అనని మాటలను ఎక్కడో కువైట్‌లో వున్న మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వినినట్లు సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం చేయడం హేయమైన చర్య అన్నారు. 2019 నుండి 2024 వరకు మీ కార్యకర్తల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడంతోనే 43 వేలు భారీ మెజారిటీతో ఎంఎల్ఏగా పులివర్తి నానిని గెలిపించారని అన్నారు. కేవలం 6 మాసాలలోనే రూ.25 కోట్లు ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్న ఎంఎల్ఏపై అవినీతి ఆరోపణలు చేసే ముందు 5 ఏళ్ళలో వందల కోట్లు ఏవిధంగా సంపాదించావో తుమ్మలగుంటలో లేదా శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ప్రమాణం చేసి చెప్పగలవా అంటూ సవాల్ విసిరారు. ఎంఎల్ఏ పులివర్తి నాని నుండి రెడ్డి సామాజిక వర్గాన్ని దూరం చేయాలనే కుట్రలు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి, టిడిపి జిల్లా పాధ్యక్షుడు గౌస్‌భాషా, పెరుమాళ్ పల్లి రఘునాధరెడ్డి, హరి, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యత లేని ఉపాధ్యాయులు: చిన్నారులపై కోతుల దాడులు

శ్రీకాళహస్తి, జనవరి 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో కోతుల దాడులు పెచ్చుపెరిగిపోతున్నాయి. భక్తుల చేతుల్లో పూజా సామగ్రి బ్యాగులను లాక్కోవటమే కాకుండా దుకాణాల్లో తినుబండారాలను లాక్కెళుతున్నాయి. ఈ నేపధ్యంలో సోమవారం పట్టణంలోని కర్నాల వీధిలో నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకునే ఉమాశంకర్ అనే బేబీ క్లాస్ విద్యార్థిపై కోతులు దాడి చేసి తలపై కొరికి గాయాలు చేసాయి. బజారువీధికి చెందిన ఉమాశంకర్ తల్లిదండ్రులు తమ బిడ్డను పాఠశాలకు పంపే అలవాటు ఉండాలని భావించి పక్కనే ఉన్న ఓ కాన్వెంట్‌కు పంపారు. అక్కడ కోతులు పసిబిడ్డ తలపై కొరికి గాయం చేయగా రక్తం కారుతుంటే పక్కనే ఉన్న వైద్యశాలకు పంపకుండా పాఠశాలల్లోనే తాము వెళ్ళే వరకు బిడ్డ తల నుంచి రక్తం కారుతున్నా పాఠశాల ఉపాధ్యాయులు పట్టించుకోక పోవటం శోచనీయం అని బాలుని తండ్రి ఆవేదన వ్యక్తం చేసారు.

## సిమెంటు రోడ్డు నిర్మాణాలకు నిధులిచ్చినా చేయరెందుకు?

గోకులాల పూర్తి చేయరా?

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 6 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలో అభివృద్ధి పనులకు సంబంధించి శ్రద్ధ చూపటం లేదని నిధులిచ్చినా పనులు చేయరెందుకని ధ్యామా పిడి సివి శ్రీనివాస్ ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేసారు. సోమవారం ఆయన మండలంలోని అంజిమేడు పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులును పరిశీలించారు. మండలంలో మినీ గోకులాల నిర్మాణాలు నత్తనడక నడుస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఇక్కడ సిమెంటు రోడ్డు పనులను శివశంకర్‌రెడ్డి చేపట్టి నిర్వహిస్తున్నారు. ఆయనతో పిడి మాట్లాడారు. సిమెంటు రోడ్డు నిర్మాణంతో పాటు ఇరువైపుల గ్రావెల్ మట్టితో షోల్డర్స్ ఏర్పాటు చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ఎంతో అవసరం అన్నారు. అభివృద్ధికి సంబంధించి నిర్లక్ష్యం వహిస్తున్న ఇంజనీర్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు. మండల పంచాయతీ రాజ్ ఇంజనీర్లు రవితేజ అదనపు అధికారి దేవరితో చర్చిస్తూ మండలానికి 24 పనులుమంజూరు అయితే కేవలం 11 పనులు మాత్రమే పూర్తి చేయటం గమనిస్తే అభివృద్ధి ఇలా అయితే ఎలా అని ప్రశ్నించారు. ఈ పరిశీలనలో అదనపు అధికారులు డి.చంద్రశేఖర్ రాజు, అవిలాల దేవరి, మండల ఇంజనీర్ బి.రవితేజ, టెక్నికల్ అసిస్టెంట్‌శాలిమనోహర్, జూనియర్‌ఇంజనీర్‌పంజాడబాలాజి రావ్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 10న వైకుంఠ ఏకాదశికి భక్తులు విశేష సంఖ్యలో తిరుమల వెళ్ళి ఉత్తర ద్వార దర్శనం కోసం పడిగాపులు పడటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొండమాన్‌పురంలోని టిటిడికి అనుబంధంగా నిర్వహిస్తున్న తొండమాన్‌పురంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధార్మిక కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. టిటిడికిఅనుబంధంగా ఉన్న ఈ ఆలయంలో వైకుంఠ ఏకాదశి దర్శనానికి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే టెంపుల్ ఇన్స్ పెక్టర్ రవిరెడ్డి సారధ్యంలో క్యూలైన్లను రూపకల్పన చేసారు. ఆలయఅర్చకులుబాబూస్వామి, రమణాచార్యులసూచనలతోటెంపుల్ ఇన్స్ పెక్టర్ ఏర్పాట్లుచక్కగా చేపట్టారు.

## ధర్మరాజుల స్వామి ఆలయానికి మహర్దశ

భూములుపంచాయతీకి అప్పగింత

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురం సమీపంలోని ధర్మరాజుల గుడి భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ భూములు రోడ్డు పక్కన ఉండటంతో ఆక్రమణల విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో కూడా ఆక్రమణల ఆరోపణలు రాగా రెవెన్యూ సర్వేయర్ సర్వే జరిపి రికార్డులను అప్పగించారు. ఈ నేపధ్యంలో ధర్మరాజుల స్వామి ఆలయం ఎదురుగా ఉన్న భూములను చక్కగా తీర్చి దిద్దారు. సర్వే రికార్డుల ప్రకారం ఆలయ భూములకు సంబంధించి గ్రామానికి చెందిన నాయకుడు బ్రహ్మెమభూషణం రెడ్డి సారధ్యంలో ఫెన్సింగ్ వేయించారు. భవిష్యత్తులో భూములు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఆలయ భూములను పంచాయతీకి అప్పగించారు. ఇక ధర్మరాజుల స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు రూపొం దిస్తున్నారు. పురాతనమైన ఆలయం జీర్ణోద్ధారణకు నిధుల అవసరం ఎంతైనా ఉంది. ఎట్టకేలకు ఆలయ భూములను పంచాయతీకి అప్పగించటంతో రాబోవు రోజుల్లో ఆలయాభివృద్ధి సులభమనే భావం కల్గుతుంది.

## వ్యక్తిత్వ నిర్మాణమే ప్రగతికి సోపానం. అంకుర్ జున్ వాలా

తిరుపతి విద్య జనవరి 6 ప్రభాత వార్త:



వ్యక్తిత్వ నిర్మాణమే ప్రగతికి సోపానమని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షుడు అంకుర్ జున్ వాలా పేర్కొన్నారు. సోమవారం తిరుపతిలోని ప్రముఖ హోటల్లో రెండు రాష్ట్రాల జెసిఐ చాప్టర్ అధ్యక్షుల మూడు రోజుల శిక్షణా శిబిరాన్ని ప్రారంభిం చారు. చదువుతో పాటు సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. సామాజిక స్పృహ, జాతీయ భావం తో సేవా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు సుమిత్ గోయల్ అధ్యక్షత వహించారు. శిబిర శిక్షకులు, శిరీష్ దండూ, పూసర్ల రజిత, ఎన్ బి హర్ష వర్ధన్ రెడ్డి ప్రసంగించారు. ఈ తిరుపతి జోన్ జె సి ఐ అధ్యక్షులు శేష సాయి, మూడు జోన్ ల అధ్యక్షులు సంతోష్, చతుర్వేది, భరత్, జాతీయ నేతలు జి ఎల్ మనోహర్, కృష్ణమూర్తి 85 మంది చాప్టర్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు పెట్టుకుని పోలీసులకు సహకరించాలి

రేణిగుంట, జనవరి 6 ప్రభాతవార్త:



ప్రతి దేవాలయంలో సీసీ కెమెరాలు అమర్చుకుని పోలీసులకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రూరల్ సీఐ మురళీకృష్ణ, అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, రేణిగుంట చెక్‌పోస్టు సమీపంలోని ఓ హోటల్‌లో మండలంలోని అన్ని దేవస్థానాల ధర్మకర్తలు, పాలక కమిటీలతో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మురళీకృష్ణమాట్లాడుతూ ప్రతి దేవస్థానంలో దొంగతనాలు నివారించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్మార్ట్ లాక్ సిస్టం గురించి వారికి విశదీకరించారు. స్మార్ట్ లాకులు వినియోగం వల్ల దొంగలు లాక్‌లను బ్రేక్ చేయాలనుకుంటే స్మార్ట్ లాక్‌లు ఎలా పని చేస్తాయో తెలియజేశారు.

## రాస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

రేణిగుంట, జనవరి 6 ప్రభాతవార్త:



రాష్ట్రీయ సేవా సమితి(రాస్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కీర్తి శేషులు పద్మశ్రీ డా. గుత్తా మునిరత్నం(89) జయంతి సందర్భంగా రేణిగుంట మండలం కరకంబాడి ఇందిరానగర్ రాస్ కార్యాలయ ఆవరణలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో రాస్ పర్యవేక్షణలో సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరిగింది. రాష్ట్రప్రధాన కార్యదర్శి డా. ఎస్.మునిరత్నం శిబిరాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కళ్ళ అద్దాలు అందజేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి వైద్యశాలకు తీసుకెళ్లారు. తిరుపతి రాస్ కార్యాలయంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించడంతో పాటు పలువురు నిరుపేదలకు నిత్యావసర సరకులు, దుప్పట్లు, వృద్ధులకు చేతి కర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో రాస్‌సంయుక్త కార్యదర్శి మమత, పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు, అరవింద వైద్యులు చైతన్య, వంశీకృష్ణ, శిబిర ఆర్గనైజర్లు కుమార్, జీవన్‌రావు, ట్రస్టీలు రమేష్‌రెడ్డి, సుబ్బరత్నమ్మ, నిత్యసుధ, రామ సుబ్బమ్మ, శ్యామల, రాస్ ఉద్యోగులు గిరి, అన్నగలన్, ఇంధుమతి, జ్యోతి, నాగమణి, స్వాతి, శంకరయ్య, శైలజ, భారతి, నాగేంద్ర, క్లస్టర్ లీడర్లు, అరవింద కంటి ఆస్పత్రి బృందం పాల్గొన్నారు.

## గ్యాస్ లీకేజీలో గాయపడ్డ కార్మికులను ఆదుకోవాలి

వామపక్ష పార్టీల డిమాండ్

నారాయణవనం, జనవరి 6 ప్రభాతవార్త :



నారాయణవనం మండలం కీళగరం పంచాయతీ పరిధిలోని లక్కీ ఫర్ యు ఎక్సమ్ ఫార్మసీ కంపెనీలో శనివారం రాత్రి జరిగిన గ్యాస్ పైప్‌లైన్ లీక్‌లో గాయపడ్డ కార్మికులను ఆదుకోవాలని సిపిఎం, సిపిఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం నాయకులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని గ్యాస్ లీకేజీ అయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ నార్త్ ఇండియన్‌తో పాటు, స్థానికులు సుమారు 10 మంది వరకు గాయపడడంతో వారిని ఆదుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన తహశీల్దారు జయరాములుకు వినతిపత్రం అందించారు. వామపక్ష పార్టీ నాయకులు డి మహేష్, చంద్రబాబు, శరవణ, మునిశంకర్, రామచ ద్రారెడ్డి, సిఐటియు నాగలాపురం నాగరాజు పాల్గొన్నారు.

## భక్తులకు నీటి సౌకర్యం కల్పించండి

పాకాల, జనవరి 6, ప్రభాతవార్త



పాకాల మండలంలోని నెండ్రగుంట పి కొత్తకోట మధ్యలో నేషనల్ హైవే కి ఆనుకొని ఉన్న పురాతన అనంతరాయ ఆంజనేయస్వామి గుడి వద్ద భక్తులు పెద్ద ఎత్తున ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఇక్కడ కొంతసేపు ఆగి సేద తీరి వెళుతుంటారు. వీరి సౌకర్యార్థం మంచి నీటి బోరు మోటారు మరియు ఓవర్ హెడ్ ఇక్కడ ట్యాంక్కులు లేవు. ఈ మార్గంలో నిత్యం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల వారు తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శన నిమిత్తం కాలినడకన వస్తూ ఇక్కడ కొంత ఆగురుతారు. ఇక్కడికి వచ్చిన భక్తులకు వంట వండటానికి నీరు గాని కాలకృ త్యములు తీర్చుకొనుటకు గాని సరైన భాత్రూం సౌకర్యాలు లేవు. త్రాగటానికి మంచి నీరు లేక చాలా కాలం నుంచి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లేక తిరు మల తిరుపతి దేవస్థానం వారు కానీ ఈ సమస్య పై దృష్టి సారించి కాలి నడకన వచ్చే భక్తులకు కోసం మంచి నీటి సౌకర్యం, ఇతర నీటి అవసరాలు తీర్చవలసినదిగా పాదచారులు స్థానికులు కోరుతు న్నారు.

## ఎట్టకేలకు మిషన్ వాత్సల్యకు మోక్షం

పథకం అమలుకు కమిటీలు

పాకాల, జనవరి 6, ప్రభాతవార్త





ఎట్టకేలకు మిషన్ వాత్సల్య పథకానికి మోక్షం లభించింది. గత ఏడాది సెప్టెంబర్ 30న వార్తలో వచ్చిన కథనం ఇంకెంత కాలం ఈ నిరీక్షణ, మిషన్ వాత్సల్య లబ్ధిదారుల వేదన అంటూ వచ్చిన కథనానికి ప్రభుత్వం నుండి స్పందన లభించింది. ఇందులో భాగంగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. మిషన్ వాత్సల్య పథకం అమలుకు రాష్ట్ర, జిల్లా, పట్టణ, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసింది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇప్పటికే లబ్ధిదారులు తమ వివరాలతో కూడిన అప్లికేషన్లు గ్రామ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కి అందజేసినందున ప్రభుత్వం కాలయాపన చేయకుండా త్వరితగతిన అమలు చేయాలని కోరుతున్నారు.

## రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలి - తహసీల్దార్

కేవీబీ పురం, జనవరి 6 ప్రభాతవార్త:



ప్రజా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సు అని తహసీల్దార్ మునిరత్నం తెలిపారు. కేవీబీ పురం మండలం తిమ్మ సముద్రం గ్రామ పంచాయతీలో టీడీపీ సీనియర్ నేత స్థానిక సర్పంచ్ దొరబాబునాయుడు అధ్యక్షతన సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకే రెవెన్యూ సదస్సులు తీసుకొచ్చిందని, ఈ యొక్క సదస్సును ప్రతి ఒక్కరు సద్వినియోగంచేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఇచ్చిన రెవెన్యూ ఫిర్యాదులను పరిశీలించారు. అలాగే ఆయకట్టు ప్రెసిడెంట్ బంగారు చెంచు కృష్ణయ్య రాగిగుంట గ్రామ కమిటీ అధ్యక్షులు గంజి బలరామయ్య తదితరులు పాల్గొని గ్రామంలోని రెవెన్యూ సదస్సులపై తహసీల్దార్‌కి ఫిర్యాదులు అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ బొర్రా జయమ్మ, తిరుపతి పార్లమెంట్ కన్వీనర్ దామరపాకు, వెంకటకృష్ణయ్య, తిమ్మ సముద్రం ఆయకట్టు ప్రెసిడెంట్ శివయ్యనాయుడు, వైస్ ప్రెసిడెంట్ శివారెడ్డి, డైరెక్టర్లు వీరారెడ్డి, వెంకటేష్ నాయుడు, బొర్రా శేఖర్‌రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పద్మావతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుంతలుగా మారిన గ్రామీణ రోడ్లు - పట్టించుకోని అధికారులు

పూతలపట్టు, జనవరి 6, ప్రభాతవార్త



పూతలపట్టు మండలంలోని బియ్యం గోడౌన్ సమీపాన గుంతలమాయంగా జాతీయ రహదారి రోడ్ల అధ్వానంగా మారుతున్న సంబంధిత శాఖ పట్టించుకోని అధికారులు ఈ క్రమంలో పెనుమూరు నుండి పూతలపట్టు వెళ్లాలన్న పూతలపట్టు నుండి పెనుమూరు వెళ్లాలన్న రాత్రి వేళలో ఇబ్బందులకు గురవుతున్నారని పలు గ్రామాలు ప్రజలు ఆరోపిస్తున్నారు. గుంతలుగా ఏర్పడి రోడ్డు రూపాన్ని కోల్పోయింది. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడం లేదన్నారు. ఈ రోడ్డుపై నిత్యం ద్విచక్ర వాహనాలు ఆటోలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుం టాయి. గుంతలు పడిన రోడ్డుమీద ప్రయాణం చేయాలన్న నరకాన్ని తలపిస్తుందని వాహనదారాలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్టు వేసి గుంతలో పడిన రోడ్డు కు శాశ్వతంగా మరమ్మతులకు చేపట్టాలని పలు గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

## డీకేటీ పట్టాలకు భూములు చూపించండి

- మహారాజపురం వాసులు వినతి

విజయపురం, జనవరి 6 ప్రభాతవార్త:



మాకిచ్చిన డీకేటీ పట్టాలకు భూములు చూపించాలని మండలంలో మహారాజపురం ఆది ఆంధ్రవాడ వాసులు సోమవారం తహసీల్దార్ కిరణ్ వినతిపత్రం అందించారు. మాకు సర్వే నెం.177,178లో డీకేటీ పట్టాలు పంపిణీ చేశారని, కానీ ఇంత వరకు భూములు చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డులు పరిశీలించి, సర్వే చేసి న్యాయం చేస్తామన్నారు. గ్రావెల్ క్వారీలకు తక్షణమే అనుమతులు ప్రభుత్వం మాకు ఇచ్చిన డీకేటీ భూముల్లో గ్రావెల్ క్వారీలకు మాత్రం పనులు యుద్ధ ప్రాతిపదికన చేస్తారని, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సర్వే నెం.1/పీ పేరుతో మైనింగ్ అధికారులు అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, ఆ సర్వే నెంబరు ఎక్కడ ఉందో తెలియదు కాని గ్రావెల్ మాత్రం యధేచ్ఛగా తరలిస్తున్నారని ఆరోపణలు చేశారు. మా పట్టాలకు భూములు చూపిన తరువాత గ్రావెల్ మట్టిని తరలించాలని డిమాండ్ చేశారు.

## మాజీ కౌన్సిలర్‌ను పరామర్శించిన మాజీ ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి, జనవరి 6 ప్రభాతవార్త



మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సోమవారం శ్రీకాళహస్తి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు ఇంటికి వెళ్ళి పరామర్శించారు. నేనున్నానని భరోసా ఇచ్చారు. రవీంద్రబాబు సతీమణి ఇటీవల ఆకాల మృత్యువు పాలయ్యారు. వారికి ఇంటికి వెళ్ళి ఓదార్చారు. ప్రగాఢ సంతాపాన్ని తెలి పారు. మాజీ శాసనసభ్యుడుతో పాటు మాజీ ధర్మ కర్తల మండలి చైర్మెన్ శ్రీనివాసులు, పాలసొసైటీ చైర్మెన్ మధుసూధనరావు(చిట్టి), మాజీ కౌన్సిలర్ ఉత్తరాజి శరవణకుమార్, శ్రీవారి సురేష్, కొత్తపాటి శ్రీనివాసులురెడ్డి, ముద్దమూడి రవిలు ఉన్నారు.

## కన్నుల పండువగా గౌరమ్మ ఉత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 6 ప్రభాతవార్త



ధనుర్మాసం ప్రతి రోజూ పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో గౌరమ్మ దర్శనం ఇవ్వటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో ఆలయ దర్శన వేళలను మార్చారు. వేకువ జాము 3గంటలకే దర్శనాలకు అనుమతిస్తున్నారు. గౌరమ్మను ముస్తాబు చేసి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. వాహనాల మండపం వద్ద అమ్మవారిని పల్లకిలో ప్రతిష్టించి నాలుగుమాడావీదుల్లోని ప్రతి గడపవద్ద గౌరమ్మకు హారతులిచ్చారు. సోమవారం గౌరమ్మ ఉత్సవంతో పాటు ఆలయ ఇన్స్ పెక్టర్ సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు వారి సిబ్బంది పర్యవేక్షించారు.

## కామర్స్‌లో స్వప్నకు డాక్టరేట్ ప్రదానం



తిరుపతి విద్య జనవరి 6 ప్రభాత వార్త:

శ్రీవేంకటేశ్వర విశ్వావిద్యాలయం కామర్స్ విభాగ పరిశోధకురాలు పి.స్వప్న డాక్టరేట్ పొందారు. ఈమె ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్ పర్యవేక్షణ లో మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఆన్ 7 పిసెస్ అఫ్ షాపింగ్ మాల్స్ ఇన్ ఇండియా ఏ స్టడీ విత్ రిఫరెన్సె టూ బెంగుళూరు సిటీ అనే అంశముపై పరిశోధనలు చేశారు. ఈమె పలు అంతర్జాతీయ, మరియు జాతీయ సెమినార్స్ లో పరిశోధన పత్రాలు సమర్పించారు. అధ్యాపకులు, స్కాలర్స్, విద్యార్థులు అభినందించారు.

# గూడూరు డివిజన్

## పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలి : ఎంఈఓ



బాలాయపల్లి, జనవరి 6 ప్రభాతవార్త: పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈఓ కిల్ల వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. కాముకూరు ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తల్లిదండ్రు లను ఒప్పించి పాఠశాలల్లో చిన్నారులను చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాల మిన్నగా ఉన్నాయని తెలిపారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ మూర్తి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వార్డులో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు

వెంకటగిరి, జనవరి 6 ప్రభాతవార్త :14వ వార్డులో ప్రజలు తెలిపిన సమస్యలు పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని కౌన్సిలర్ శంకరయ్య తెలిపారు. మున్సిపాలిటీ సుదర్శన్ నగర్ సచివాలయ పరిధిలో ప్రజల సమస్యల మీద గ్రీవెన్స్ జరగడం జరిగింది. ఇందులో భాగంగా అక్కడ ఉన్న స్థానిక బొగ్గులమెట్ట ధర్మాపురం, నరసింహారావు వీధి ముత్తరాశిపాలెం ప్రజలు తమ సమస్యల మీద సచివాలయం వచ్చి అర్జీలు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

## విద్యార్థులకు... విద్యా సామాగ్రి పంపిణీ



చిల్లకూరు, జనవరి 6 ప్రభాతవార్త : మండల పరిధిలోని పాలిచెర్ల వారి పాళెం ఉన్నత పాఠశాలలో సోమవారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల కోఆప్షన్ సభ్యులు వెలగపూడి ప్రదీప్ కుమార్ దాతృత్వంతో తెలుగు, ఇంగ్లీష్ స్టడీ మెటీరియల్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు చంద్ర, చంద్ర శేఖర్, మాధవయ్య, ప్రజేంద్ర రెడ్డి, నాగభూషణమ్మ, సురేంద్ర, గ్రామ పెద్దలు సుబ్రహ్మణ్యం నాయుడుతో పాటు విద్యా కమిటీ సభ్యులు కూడా పాల్గొన్నారు.

## పేద భూములను తిరిగి ఇవ్వకుండా చర్యలు తప్పవు / - గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ హెచ్చరిక



కోట, జనవరి 6 ప్రభాతవార్త : కేశవరం పంచాయతీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేదల భూములను కొంతమంది ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని, అటువంటి వారు తిరిగి ఆ భూములను పేదలకు అప్పగించాలని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ కోరారు. సోమవారం కోట మండలం కేశవరంలో రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వందలాది ఎకరాల భూములను కొంతమంది నాయకులు ఆక్రమించుకున్నారని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని చెప్పారు. మీరే స్వయంగా ఆక్రమించుకున్న భూములను తిరిగి ఇవ్వకపోతే మీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఏ సర్వే నంబర్లో ఎంత భూమి ఆక్రమించుకున్నారో అటు అధికారులు, స్థానిక ప్రజలకు తెలుసన్నారు. ఈ విషయంలో ఏమాత్రం ఆలోచించకుండా పేదలకు ఆ భూములు అప్పగించాలని ఆయన కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ ప్రభుత్వం ఒక గొప్ప ఆలోచనతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. 45 రోజుల్లోగా పేదల భూముల సమస్యలను అధికారులు సమగ్రంగా విచారణ జరిపి న్యాయం చేస్తారని చెప్పారు. ఈ సదస్సుల్లో తహశీల్దార్ కె.జయ జయరావు, ఎంపిడిఓ వేణు, టిడిపి నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరథ రామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్‌రెడ్డి, మధుసూదన్ యాదవ్, తూపిలి రాధాకృష్ణారెడ్డి, ఎంపిటిసిలు షంషుద్దిన్, దారా సురేష్, విజయభాస్కర్‌రెడ్డి, జితేంద్రరెడ్డి, కోటేశ్వరరెడ్డి, పోలయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారమే రెవిన్యూ సదస్సుల ఉద్దేశం



ఓజిలి, జనవరి 6 ప్రభాతవార్త : గ్రామాల్లో నెలకొన్న భూ వివాదాలకు రెవిన్యూ సదస్సులు చక్కటి పరిస్కారం చూపు తాయని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జోషులవారి కండ్రిగ ఆయకట్టు అధ్యక్షుడు నలజాం రాజశేఖర్ పేర్కొన్నారు. ఓజిలి మండలం జోషులవారి కండ్రిగలో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వాటి పరి ష్కారానికి రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి భూ వివాదాలు ఉన్న రైత లు తమ సమస్యలు సభ దృష్టికి తీసుకొస్తే తప్పక పరిస్కారం లభిస్తుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలం ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాడి వెంకటయ్య, టిడిపి నాయకులు నల్లజ్ఞా నాగరాజు, దుప్పల రమణయ్య, వాకటి వెంకట సుబ్బయ్య, నల్లజ్ఞా అంకయ్య, నెల్లూరు అల్లేయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేడు బాలిక వికాసంపై శిక్షణ : సిడిపిఓ

బాలాయపల్లి, జనవరి 6 ప్రభాతవార్త :స్థానిక శ్రీ శక్తి భవనంలో ఈనెల 7వ తేదీ బాలిక వికాసంపై శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నట్లు సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు.మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్వాడి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆమె కోరారు.

## పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసి కృషి చేయాలి



బాలాయపల్లి, జనవరి 6 ప్రభాతవార్త : పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసి వారి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్‌మూర్తి కోరారు. కాముకూరు పాఠశాలలో ఎస్ఎంసి వారికి శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసి వారు తగు సూచనల్లో సలహాలు ఇవ్వాలని తెలిపారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పలు సూచనల్లో సలహాలు ఇచ్చారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌లు పాల్గొన్నారు.

## మైనర్ బాలికలకు వివాహం చేస్తే చర్యలు: ఎంపీడీవో



వెంకటగిరి, జనవరి 6 ప్రభాతవార్త : మైనర్లకు వివాహం చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఎంపీడీవో కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై సచివాలయం పోలీసులకు, అంగన్వాడి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మైనర్ తీరిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. బాలికల పట్ల వివక్షత చూపరాదని తెలిపారు. బాలికలను బాగా చదివించాలని సూచించారు. ఎస్సై లక్ష్మి భవాని మాట్లాడుతూ బాలికలను వేధిస్తే చట్టం వర్తిస్తుందని తెలిపారు. బాలికలపై లైంగిక దాడి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో ఎంఈఓ బాబయ్య సిడిపిఓ శంషాద్ బేగం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షునిగా జయకుమార్‌రెడ్డి



తడ, జనవరి 6 ప్రభాతవార్త : ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షునిగా తడకు చెందిన బి.జయకుమార్‌రెడ్డిని నియమించారు. తడకండ్రిగ పంచాయతీలో చురుకైన కార్యకర్తగా ఉన్న ఆయనను పార్టీ అధిష్ఠానం గుర్తించింది. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు అత్యంత సన్నిహితంగా ఉన్న జయకుమార్‌రెడ్డి గత స్థానిక ఎన్నికల్లో ఎంపిటిసి టికెట్‌ను త్యాగం చేశారు. ఆయన తండ్రి శివారెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చురుగ్గా వ్యవహరించేవారు. ఆయన సేవలను గుర్తించిన సంజీవయ్య జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి చెప్పి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చేశారు. అనంతరం జయకుమార్‌రెడ్డి కాకాణిని, కిలివేటిని, సూళ్లూరుపేట ఎంపిపి అల్లూరు అనిల్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## చేనిగుంటలో నగలు చోరీ

తడ, జనవరి 6 ప్రభాతవార్త : తడ మండలం చేనిగుంటలో ఇంట్లో ఎవరూ లేని సమయాన నగలు చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. కొమ్మల రవి, జ్యోతిలతో పాటు వారి పిల్లలు కూడా ఇంట్లో లేరు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి బీరువా పగులగొట్టి అందులో ఉన్న రెండు సవర్ల బంగారు అపహరించారు. రవి శ్రీసిటీలోని ఓ కంపెనీలో పనిచేస్తుండగా, ఆయన భార్య జ్యోతి ఓంశక్తి మాల ధరించి తమిళనాడులోని ఒక గుడికి వెళ్లినట్లు సమాచారం. పిల్లలను ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంచడంతో ఇంట్లో ఎవరూ లేని సమయాన ఈ చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ కొండప్పనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేట పోలీసుల అదుపులో...ఆరుమంది బైక్‌దొంగలు!

నాయుడుపేట, జనవరి 6 ప్రభాతవార్త : సూళ్ళూరుపేట నియోజకవర్గంలో గతకొంత కాలంనుండి మోటార్‌సైకిల్ వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠాను ఎట్టికేలకు నాయుడుపేట పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు. నాయుడుపేట పట్టణం, దొరవారిసత్రం, సూళ్ళూరుపేట, తడ ప్రాంతాల్లో మోటార్‌సైకిల్‌ను గుర్తించి అపహరించుకొని వెళ్ళి తమిళనాడు పరిసర ప్రాంతాల్లో అమ్ముకొని, వచ్చిన నగదుతో జల్సాలు చేస్తున్నట్లు తెలిసింది. మోటార్ సైకిళ్ళు వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా తడ,ఆరంబాకం తమిళనాడు ప్రాంతాలకు చెందిన వారుగా తెలుస్తోంది. నాయుడుపేట పోలీసులు మోటార్‌సైకిల్ చోరీలకు పాల్పడుతున్న ముఠాలో ఆరుమంది యువకులను అదుపులోనికి తీసుకొని వారిని రహస్యంగా విచారిస్తున్నారు.

## రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

నాయుడుపేట జనవరి 6 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని చలివేంద్రం వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో కార్తీక్ అనే యువకుడు సోమవారం సాయంత్రం తీవ్రంగా గాయపడ్డాడు.సేకరించిన సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేటకు చెందిన కార్తీక్ మోటార్‌సైకిల్‌పై మేనకూరు వద్దఉన్న కంపెనీలో ఉద్యోగం చేసుకొని తిరిగి నాయుడుపేటకు మోటార్ సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యలో చలివేంద్రం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాధవశాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు.స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని 108సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## వీఆర్ఏ మృతికి రెవెన్యూ సిబ్బంది పరామర్శ

వాకాడు, జనవరి 6 ప్రభాతవార్త : వాకాడులోని వీఆర్ఏ గాయం పుల్లమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. తహశీల్దార్ రామయ్య, డిప్యూటీ తాసిల్దార్ సందీప్ కుమార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్ వీఆర్వో కాటమ్మ, నెల్సన్, విఆర్ఎల్‌లు మృతి చెందిన పుల్లమ్మకు పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. వాకాడు ఉపసర్పంచ్ పాపారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గూడూరు సుధాకర్‌రెడ్డి, పలువురు నాయకులు పుల్లమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## కాణిపాకం ఘనంగా ప్రచారరథంకు ప్రత్యేకపూజలు



కాణిపాకం, జనవరి 6 ప్రభాతవార్త: రాష్ట్ర దేవాదాయ, దర్మాదాయశాఖ, హిందూ ధర్మపరిరక్షణ ట్రస్టు, కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంల సంయుక్త ఆధ్వర్యంలో ఆలయ ప్రాశస్త్యాన్ని, స్వామివారి విశిష్టత, నైతిక విలువలు, సనాతన ధర్మ సూత్రములు, ఆలయ పవిత్రత గురించి ప్రజలకు తెలియజేసేందుకు వీలుగా ఏడు రోజుల పాటు చిత్తూరు జిల్లాలో పర్యటించనున్న స్వామివారి ప్రచారరథంకు సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. సోమవారం కాణిపాకం నుండి ప్రచారరథం బయలుదేరి ఏడు రోజుల పాటు చిత్తూరు జిల్లాలోని తవణంపల్లె, బంగారుపాళ్యం, పలమనేరు, బైరెడ్డిపల్లె, గుడివంక, రామకుప్పం, లక్ష్మీపురంలలోని ప్రముఖ ఆలయాలు, ఎస్సీ, ఎస్టీ, బిసీ వాడల్లో పర్యటించి స్వామివారి కళ్యాణోత్స వాలను నిర్వహించనున్నారు. ఈమేరకు సోమవారం ఇక్కడ నుండి రథం బయలు దేరి వెళ్ళింది. దీనితో ఆలయ అధికారులు,అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రధాన అలయం నుండి తీసుకువచ్చి రథంపై వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఇక్కడ నుండి బయలు దేరి వెళ్ళింది. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు,అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది చివరికి...రహదారులు పూర్తి చేస్తాం! - మెగా ఇంజనీరింగ్ సంస్థ నిర్వాహకులు వెల్లడి



చిల్లకూరు, జనవరి 6 ప్రభాతవార్త : నరేంద్ర మోడీ ప్రధాని అయినప్పటి నుండి జాతీయ రహదారులు విషయంలో ఎక్కడ కూడా వెనకడుగు వేయకుండా వేల కిలోమీటర్లు రహదారులు ఏర్పాటు చేయడం జరుగుతుందని మెగా ఇంజనీరింగ్ సంస్థ నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా కలకత్తా నుండి కన్యాకుమారికి నాలుగు వరుసల రహదారి ఏర్పాటు చేసి ఉండగా వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆరవ రహదారి ఏర్పాటు చేయడం జరుగుతున్న విషయం అందరికి తెలిసిందే. గూడూరు బైపాస్‌లోని పోటు పాలెంసర్కిల్, వరంగల్ క్రాస్‌రోడ్ సర్కిల్ వద్ద వాహనాలు రోడ్డు దాటే క్రమంలో ఎన్నో ప్రమాదాలు జరిగి ఉన్నాయని దృష్టిలో ఉంచుకొని నూతనంగా ఫ్లైఓవర్లు పనులు శరవేగంగా ఏర్పాటు చేయడం జరుగుతున్నదన్నారు. నిర్మాణంతో పాటు వరగలి క్రాస్ రోడ్ నుండి ముత్తుకూరు సౌత్ గేటు వరకు 36 కిలోమీటర్లు 6 వరసల రహదారికి 689 కోట్ల రూపాయలు నిధులతో మెగా ఇంజనీరింగ్ సంస్థ శరవేగంగా పనులు చేపడుతున్నా, అయితే ఇటీవల నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రహదారులు ఏర్పాటు కోసం లక్షల క్యూబిక్ మీటర్లు గ్రావెల్, ఇసుక, మట్టి, కంకర వాడకం జరిగిందని వివరించారు. దీనికి సంబంధించిన పన్నును ప్రభుత్వానికి జమ చేయడం జరిగిందన్నారు. టెండర్లు తీసుకున్న మెగా ఇంజనీరింగ్ యాజమాన్యం ముమ్మరంగా పనులు వేగవంతంగా చేపడుతున్నారు. అదేవిధంగా ఇటీవల రేణిగుంట నుండి నాయుడుపేట వరకు 58 కిలో మీటర్లు 6 వరుసల రహదారిని అతి తక్కువ సమయంలో నాణ్యమైన రహదారిని ఏర్పాటు చేయడం జరిగిందని మెగా సంస్థలు తెలిపింది.

## జీతాలు చెల్లించాలి, పండుగ గడపాలి : సిఐటియు



వెంకటగిరి, జనవరి 6 ప్రభాతవార్త : మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లిస్తేనే పండగ చేసుకుంటారని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మున్సిపల్ కార్యాలయం వద్ద జీతాలు చెల్లించాలన్నారు. కార్మికులు ధర్నా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీతాలు ఇవ్వండి పండుగ గడపండి అని అడిగేందుకు కార్మికులు వెళితే భూతులు మాట్లాడినటువంటి ఇన్చార్జి కమిషనర్ శ్రీధర్ మున్సిపల్ కార్మికులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషనర్ స్థాయిలో ఉండి బూతులు మాట్లాడడం సరైనది కాదని అన్నారు. ఆఫ్కాస్ సిబ్బందికి, డైలీ వేజెస్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించి పండుగ గడపాలని అన్నారు. కమిషనర్ క్షమాపణ చెప్పేంతవరకు, జీతాలు చెల్లించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు నాయకులు ఎం. రమణ, పట్టణ అధ్యక్షులు టి సుబ్బయ్య ఉపాధ్యక్షులు పి సుబ్రహ్మణ్యం కార్యదర్శి ఎస్ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ పెంచలయ్య, ఉపకోశాధికారి హరిబాబు, కమిటీ సభ్యులు ఇందరమ్మ, మాధురి తదితరులు పాల్గొన్నారు.

## నేదురుమల్లి స్ఫూర్తితోనే...రాజకీయం లోకి వచ్చా



వాకాడు, జనవరి 6 ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి స్ఫూర్తితోనే రాజకీయంలోకి వచ్చానని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కొడవలూరు దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇండెన్ గ్యాస్ ఆవరణ పరిధిలో ప్లాంట్లో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వైఎస్ఆర్సిపి నాయకులు కొడవలూరు దామోదర్ రెడ్డికి కేక్ కట్ చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి గురించి మాజీ ఎంపీపీ మధుసూదన్, సర్పం చుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాకాడు ఉపసర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, వాకాటి జనార్ధన్ రెడ్డి, సర్పంచ్ సిద్దారెడ్డి మధు సూదన్, అనిల్ కుమార్ రెడ్డి, యరటపల్లి మధుసూదన్ రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జయరామారావు వీధీ... ట్రాఫిక్‌కు లేదు వేరే దారి!

**- బస్సులు, ప్రైవేటు వాహనాల రద్దీ,స్పందించని పోలీసులు**

**- ఆర్టీసీ బస్సులను బైపాస్‌లో మళ్ళించడమే మార్గమా!**



శ్రీకాళహస్తి,జనవరి 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని జయ రామారావువీధి అంటే వాహన చోదకులకు దడ. ఈ వీధిలో రెండు జాతీయ బ్యాంకులు కానీ వాటికి తగిన పార్కింగ్ లేదు. ఒక సినిమా థియేటర్ దాని ఎదురుగా దుకాణాలు. సమీపంలో వైన్‌షాప్, పక్కనే మాంసాహార దుకాణాలు. ఓ వైపు సరైన పార్కింగ్ లేని బ్యాంకులు, ఎదురుగా ఎల్ఐసి బ్రాంచి దాటితో మలుపు అక్కడే స్వీట్ స్టాల్ ద్విచక్ర వాహనాల పార్కింగ్, హోల్‌సేల్ దుకాణాలు. శ్రీకాళహస్తిలో వన్‌వే ట్రాఫిక్ అమలులో ఉంది. అయితే అది ఎంత వరకు అమలు జరుగుతున్నదనేది పోలీసులకే ఎరుక. శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ నియంత్రణకు సరిపడ్డ పోలీసుల్లేదు. ఉన్న వారితోనే సరిదిద్దుకోవాల్సి వస్తుంది. ఇక్కడ ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ఏళ్ళ తరబడి ఇక్కడ వచ్చిన పోలీసు ఉన్నతాధికారులు అభ్యర్థనలే తప్ప ఆచరణకు నోచుకోవటం లేదు.

**ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టని పోలీసులు అధికారులు:**

శ్రీకాళహస్తి పట్టణంలోని వీధులు ఇరుక్కుగా ఉంటాయి. ఇక్కడ ట్రాఫిక్ క్రమబద్దీకరణకు ఆచరించాల్సిన విధానాలను అమలు పరచటంలో పోలీసుల చొరవ వారికే తెలియాలి. చేయాల్సిన పనులు చేయక ట్రాఫిక్ అంటే ఎలా? అని జనం చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా జయరామారావువీధిలో వన్ వే ట్రాఫిక్ నిబంధనల మేరకు ఎదురుగా వచ్చే వాహనాలను కట్టడి చేయటంలో ఎందుకో పోలీసుల వైఫల్యం స్పష్టంగా ఉంటుంది. బేరివారి మండపం వద్ద ప్రత్యేకంగా ఓ కానిస్టేబుల్‌ను నియమించి అక్కడ నుంచి వచ్చే వాహనాలకు ఎదురుగా ఆటోలు, కార్లను అనుమతించక కట్టడి చేస్తే సరిపోతుంది. ఒక వేళ అధికారులు నియమించినా అక్కడ డ్యూటీ చేసే సిబ్బంది అమలు చేయటం లేదు. వారి ముందే నిబంధనలకు వ్యతిరేకంగా ఆటోలు ప్రవేశిస్తుంటే ప్రేక్షక పాత్ర వహిస్తుంటారు.

**సన్నిధి వీధిలో బస్సులను ఎందుకు అనుమతిస్తున్నారు?**

శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపువెళ్ళె గూడూరు,సూళ్ళూరుపేట, చెన్నైకు చెందిన కొన్ని ఆర్‌టిసి బస్సులు బిక్షాల గాలిగోపురం నుంచి సన్నిధీవీధి గుండా వెళుతున్నాయి. ఈ మార్గంలో రాములవారి మందిరం వద్ద కార్లు తిరగటమే కష్టం,అలాంటిది బస్సులంటే ఇక చెప్పాల్సిన పని లేదు. జలవినాయక ఆలయం వద్ద యూటర్న్ తీసుకోవాలి ఇక్కడ బస్సులు తిరగటానికి తిప్పలు దాంతో గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచి పోతుంది. ఈ వైపు బస్సులను కట్టడి చేయటంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనబడుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అసలు సమస్యకు పరిష్కారం ఏమిటో తెలుసుకుంటే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

**నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు లోబడి**

## అవిలాల చెరువు సిద్ధం కావాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్**



తిరుపతి కలెక్టరేట్, జనవరి 6 ప్రభాతవార్త : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు లోబడి అవిలాల చెరువు అభివృద్ధిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సమీక్ష నిర్వహించి పూర్తి స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అవిలాల చెరువును ఎన్జిటి నిబంధలనకు లోబడి అభివృద్ధి చేయుట కోసం పూర్తి స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు అవిలాల చెరువు అభివృద్ధిపై పచ్చదనం పెంపు వాకింగ్ ట్రాక్ చెరువు కరకట్ట బలోపేతం చేయడం తదితర అంశాలను వాటికి అవసరమయ్యే నిధుల అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో తుడా సెక్రటరీ వెంకటనారాయణ, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, ఉద్యాన శాఖ అధికారిణి మాలతి,టీటీడీ ఈఈ మనోహర్, ఇరిగేషన్ ఈఈ ప్రసాద్, అర్కిటెక్ట్ రఘురామన్, తదితరులు పాల్గొన్నారు.

## సర్వమానవాళి శ్రేయస్సుకోసం నగరసంకీర్తన

**-ఏడాదిగా నిరంతరాయంగా కొనసాగించడం అద్భుతమన్న వక్తలు**



తిరుపతి(రవాణ),జనవరి 6ప్రభాతవార్త: ఆధ్యాత్మికనగరం తిరుపతిలో సర్వమానవాళి శ్రేయస్సు కోరుతూ రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ప్రతి శనివారం చేపట్టే నగరసంకీర్తన నిరంతరాయంగా జరగడం అద్భుతమని డాలర్స్‌గ్రూప్ ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. నగరసంకీర్తన ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం ఉదయం తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం పరిసరాల్లో భజన కళాకారులు, రంగస్థలి కళాకారులు భక్తితో ఆధ్యాత్మిక వాతావరణంలో భజనలు చేశారు. నగరం భక్తితో పులకించింది. ధనుర్మాసంలో వివిధ వేషధారణలు ధరించి కళాకారులు ఉదయం వేళ నగరసంకీర్తన, మంగళ వాయిద్యాలతో ప్రజలను ఆధ్యాత్మికచింతన వైపు తీసుకురావడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా ఏడాది పూర్తయిన నగరసంకీర్తనతో ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డాలర్ దివాకర్‌రెడ్డి, గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, జేజిరెడ్డి, కస్పాపద్మనాభం, కళాకారుల సేవలను కొనియాడారు.

## భక్తుల ఆరోగ్యభద్రతే టిటిడి ప్రథమ లక్ష్యం

**-అదనపు ఈఓ చౌదరి**



తిరుమల.జనవరి 6ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకు వచ్చే యాత్రికుల ఆరోగ్యభద్రతకు భరోసా కల్పించడం టిటిడి ప్రథమ లక్ష్యమని ,తిరుమలలోని హోటళ్ళ యజమానులు భక్తులకు నాణ్యతా ప్రమాణాలతో ఆహారం అందించాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి చెప్పారు. హోటళ్ళ యజమానులతో సోమవారం సాయంత్రం తిరుమలలో సమావేశం నిర్వహించారు. తిరుమలలోని అన్ని హోటళ్ళు, ఫాస్టుపుడ్ కేంద్రాలు నాణ్యత,పరిశభ్రత, శుచికి ప్రాధాన్యతనివ్వాలన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం



గుడుపల్లి,జనవరి6 ప్రభాతవార్త : రెండు రోజుల కుప్పం పర్యటన నిమిత్తం విచ్చేసిన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రులు, ఎంయల్ఎలు, ఎంపీలు, ఎంయల్‌సీలు, ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు.సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు బెంగళూరు నుండి హెలీకాప్టర్‌లో గుడుపల్లి మండలం లోని ద్రావిడ యూనివర్శిటీ ఇందిరా గాంధీ స్టేడియంలోని హెలీ ప్యాడ్‌కు చేరుకున్నారు. నేతలు రాష్ట్రరవాణాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, రాష్ట్ర ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పియస్.మునిరత్నం, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,అనంతపురంరేంజ్ డిఐజి షిమోషి,ఎస్పీ మణికంఠ చందోలు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు,జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్,ఎమ్మెల్యేలు యన్. అమరనాథ్ రెడ్డి,గురజాల జగన్‌మోహన్,గాలి భానుప్రకాష్, వి.యం.థామస్, కె.మురళీ మోహన్, కె.ఆదిమూలం, పులివర్తి నాని,మాజీ మంత్రి పనపాకం లక్ష్మీ, మాజీ ఎమెల్సీలు రాజసింహులు,గౌనివాని శ్రీనివాసులు, మాజీ ఎంయల్ఎలు మనోహర్, సుగుణమ్మ, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రాష్ట్ర నేతలు బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, పరిశీలకుడు ఖాదర్ బాషా, స్థానిక నేతలు మండల అధ్యక్షుడు బాబు నాయుడు, సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్,హేమాంబర్ గౌడు,బేటప్పనాయుడు, మునిరాజు,జనసేన మండల అధ్యక్షుడు అమీర్, బాను, సుబ్బూ,మంజూమరియా అధికారులు, కార్యకర్తలు, జనసేన, బిజేపి,నేతలు స్వాగతం పలికారు.

## సీఎం చంద్రబాబుకు కాణిపాకం గణపయ్య ప్రసాదాలు

కాణిపాకం, జనవరి 6 ప్రభాతవార్త: కుప్పం నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సోమవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ టి.పెంచల కిషోర్‌లు మర్యాద పూర్వకంగా కలసి కాణిపాకం గణనాధుని ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు. కుప్పం ద్రవిడ యూనివర్సిటీ ఇందిరాగాంధీ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్న చంద్రబాబును ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యేలు మురళీమోహన్‌లు కలసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ, ప్రసాదాలను అందజేశారు.